ఉష్ణోగ్రత (అంచనా)

24-5-2025	గరిష్టం	కనిష్టం
గుంటూరు	35	27
తెనాలి	35	28
నరసరావుపేట	37	27
బాపట్ల	34	28
రెంటచింతల	36	27
చీరాల	34	28

ఉద్యోగాలంటూ.. వసూళ్లు

- ఏ శాఖలో కావాలన్నా ఇప్పిస్తామంటూ వల
- గుంటూరు కేంద్రంగా ఓ ముఠా ఘరానా మోసం
- నకిలీ అపాయింట్‌మెంట్ లెటర్లు.. ఐడీ కార్డులతో సిద్ధం
- విద్యార్హత లేకున్నా సర్టిఫికెట్లు ఇస్తామని అదనంగా దోపిడీ
- తెనాలి మండలంలో బాధితుల వ్యవహారంతో మోసం వెలుగులోకి
- గుంటూరు, బాపట్ల, పల్నాడు, కృష్ణా జిల్లాల్లో పెద్దఎత్తున వసూళ్లు




రెవెన్యూలో కావాలా? రిజిస్ట్రార్ ఆఫీస్‌లో కావాలా? పౌరసరఫరాల శాఖలో కావాలా? యూనివర్సిటీలో కావాలా? లేక సెక్రటరియేట్‌లో కావాలా? మీకు ఏ డిపార్ట్‌మెంటులో కావాలంటే ఆ డిపార్ట్‌మెంట్‌లో ఉద్యోగం ఇప్పిస్తాం. అంతే కాదు.. మీకు సరైన విద్యార్హత లేకపోయినా పర్వాలేదు.. పెద్దగా చదువు కోకున్నా ఇబ్బంది లేదు. మీ ఉద్యోగానికి కావాల్సిన అన్ని సర్టిఫికెట్లూ మేమే ఇస్తాం. కాకపోతే రేటు కొంచెం ఎక్కువవుతుందంతే.

- ఈ మాటలు వింటుంటే వెంకీ సినిమాలో కృష్ణభగవాన్ ఉద్యోగాలు ఇప్పిస్తానంటూ రవితేజా బృందాన్ని మోసం చేసేందుకు చెప్పిన సినిమా డైలాగులు గుర్తొస్తున్నాయి కదూ! ఇదే తరహాలో గుంటూరు కేంద్రంగా ఓ ముఠా ప్రభుత్వ ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ రూ.లక్షల్లో వసూలు చేస్తోంది. ఉద్యోగాన్ని బట్టి రూ.6 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు ఇప్పటి వరకు రూ.కోట్లలో వసూలు చేసిందని సమాచారం. నకిలీ సర్టిఫికెట్లు కావాల్సి వస్తే వారి దగ్గర రూ.లక్ష నుంచి రూ.3 లక్షల వరకు అదనంగా దోచేసింది. తెనాలికి చెందిన ఓ వ్యాపారి తమ ఇద్దరు పిల్లల ఉద్యోగాల కోసం డబ్బు ఇచ్చి, మోసపోయానని గుర్తించి పోలీసులను ఆశ్రయించడంతో ఈ వ్యవహారం వెలుగులోకి వచ్చింది.

భజనలకు వచ్చి వల

ఈ ముఠాలోని ఓ వ్యక్తి తెనాలి మండలం అంగలకుదురులో అయ్యప్ప భజనలకు వచ్చి, స్థానికులతో పరిచయం పెంచుకుని ఒకరిద్దరికి వలవేసి, వారిని నమ్మించాడు. మొదట్లో వారికి ఉద్యోగం వచ్చిందంటూ, విశాఖ జిల్లాలో వీఆర్వో ట్రైనింగ్ అనిచెప్పి కొన్ని రోజులు అక్కడకు పంపాడు. తర్వాత ఉద్యోగం కావాల్సిన ప్రాంతంలో వేసేలా చూస్తామని నమ్మించాడు. రెండు, మూడు నెలలు జీతం కూడా వారి ఖాతాలకు వేశారు. దీంతో మిగిలిన వారు నమ్మేశారు. దీంతో అంగలకుదురులోనే 9 మంది వారి వలకు చిక్కితే, తెనాలిలో నలుగురు, కృష్ణా జిల్లాలో ముగ్గురు, బాపట్ల జిల్లాలో ఇద్దరు, ప్రకాశం, మరికొన్ని జిల్లాలకు చెందిన వీరి బంధువులు కలిపి మొత్తం 19 మంది ఇప్పటి వరకు ఈ ముఠా బాధితులని సమాచారం. ఇంకా బయటకు తెలియకుండా మోసపోయినవారు ఎందరున్నారనేది తెలియాల్సి ఉంది.


ACHARYA NAGARJUNA UNIVERSITY

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం

Accredited by NAAC with 'A' Grade

NH16, Nagarjuna Nagar Guntur, Andhra Pradesh - 522510

APPOINTMENT ORDER

Your appointment will be effective from 07th July 2025, and you are required to report to the undersigned or the designated reporting officer in the Computers Division on the aforementioned date to complete joining formalities and assume duties.

Your monthly base salary will be Rs. 30,000/- (Rupees Thirty Thousand only). Statutory deductions such as Employees' State Insurance (ESI) and Provident Fund (PF) contributions shall be made from your salary as per the norms and guidelines issued by the Government of India from time to time.

All other terms and conditions of your appointment including working hours, leave eligibility, code of conduct, and performance assessments will be governed by the university's service rules.

నాగార్జున యూనివర్శిటీ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్ సంతకంతో హిందూ కళాశాలలో ఉద్యోగం ఇస్తున్నట్టు బాధితునికి అందించిన నకిలీ అపాయింట్‌మెంట్ లెటర్

తెనాలి, మే 23 (ఆంధ్రజ్యోతి): ఓ క్రషర్ ఉద్యోగి, జిమ్ ట్రైనర్, మెడికల్ రిప్రజంటేటివ్, ఓ డెయిరీలో ఉద్యోగి, న్యాయవాదినని చెప్పుకునే ఓ మహిళతోపాటు మరికొందరు ఒక ముఠాగా ఏర్పడి ప్రభుత్వ ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ నిరుద్యోగులను ముంచేస్తున్నారు. గుంటూరు కేంద్రంగా ఈ ముఠా గుంటూరు, బాపట్ల, పల్నాడు, కృష్ణా జిల్లాల్లో పలువుర్ని మోసం చేసింది. చదువు పూర్తిచేసుకుని, ఉద్యోగాల వేటలో ఉన్న యువతే లక్ష్యంగా ఈ ముఠా చెలరేగిపోయింది. యువకులను, వారి తల్లిదండ్రులను నమ్మించి రూ.కోట్లలో దోచేసింది. పిల్లలు ప్రభుత్వ ఉద్యోగాల్లో స్థిరపడతారనే ఆశతో మధ్యతరగతి కుటుంబాలకు చెందిన వారు అప్పులు తెచ్చిమరీ వీరికి చెల్లించారు. వారి నుంచి రూ.50వేల నుంచి రూ.లక్ష వరకు మాత్రమే అకౌంట్ ద్వారా వేయించుకుని, మిగిలిన మొత్తాలను నగదు రూపంలోనే తీసుకోవడం వీరి ప్రత్యేకత. భవిష్యత్‌లో వీరి బండారం బయటపడితే, తీసుకున్నది తక్కువ మొత్తాలేనని చెప్పి, తప్పుకునేందుకు ఇలా చేశారని తెలుస్తోంది. ఈ ముఠాలోని వారు పది, ఇంటర్, డిగ్రీ, ఒకేషనల్ కోర్సులు, చివరకు ఇంజనీరింగ్ సర్టిఫికెట్లు కూడా ఇప్పిస్తామంటూ నగదు దోచుకున్నారని బాధితులు చెబుతున్నారు. నిరుద్యోగులను దోచేసిన ఈ ముఠాలోని వ్యక్తులపై తెనాలి పోలీస్ స్టేషన్లలో కేసులు నమోదు చేసి రోజులు కూడా గడవకుండానే మరో ఘరానా మోసం వెలుగుచూసింది. అయితే కూటమి నాయకుడు ఒకరు వారిని పట్టుకుని మోసాల (మిగతా 8వ పేజీలో)



తీరని శోకం



- రహదారులపై రక్తపుటేర్లు
- విషాదాలు నింపిన రోడ్డు ప్రమాదాలు
- ప్రకాశం జిల్లాలో స్టూవర్టుపురం వాసులు ఆరుగురి మృతి
- ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు.. వెంటవెళ్లిన స్నేహితులూ..
- చిలకలూరిపేటలో ఓ ఫొటోగ్రాఫర్.. తుళ్లూరులో ఓ బాలుడు దుర్మరణం
- పెదనందిపాడు సమీపంలో హెడ్‌కానిస్టేబుల్.. అంగలకుదురులో యువకుడు..

వేర్వేరు ప్రమాదాల్లో పది మంది దుర్మరణం

రోడ్డెక్కిన వారు ఇళ్లకు చేరలేదు. శుక్రవారం వేర్వేరు ప్రాంతాల్లో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో పది మంది మృతి చెందారు. దీంతో ఆయా కుటుంబాలు శోకసంద్రంలో మునిగిపో యాయి. అతివేగం.. నిద్రమత్తు... అజాగ్రత్తలు.. పది మందిని రోడ్లు మింగేశాయి. వ్యక్తిగత పనులకు వెళ్తూ ముగ్గురు.. స్నేహితులు రమ్మ న్నారని తోడు వెళ్లి ముగ్గురు.. రైల్లో వస్తున్న స్నేహితుడ్ని తీసుకు వచ్చేందుకని వెళ్తూ.. బతుకుతెరువు వేటలో ఓ ఫొటోగ్రాఫర్.. విధులు నిమిత్తం వెళ్లూ ఓ హెడ్‌కానిస్టేబుల్.. గ్రావెల్ లారీ వేగానికి ఓ బాలుడు అశువులు బాశారు. ప్రకాశం జిల్లాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో స్టూవర్టుపురానికి చెందిన ఆరు గురు మృతి చెందగా వారిలో ఒకే కుటుంబా నికి చెందిన ముగ్గురు ఉండటంతో బంధు వులతో పాటు గ్రామస్తులు విషాదంలో మునిగి పోయారు. తుళ్లూరులో గ్రావెల్ టిప్పర్ బలితీసుకున్న ఘటనలో తమకు చేదుడుగా ఉంటున్న ఒకేఒక కుమారుడు మృతితో తల్లి దండ్రులు కన్నీటి పర్యంతమవుతున్నారు.

బాపట్ల, పెదనందిపాడు, తెనాలి రూరల్, చిలకలూరిపేట, తుళ్లూరు, మే 23 (ఆంధ్రజ్యోతి): నిర్లక్ష్యపు డ్రైవింగ్ ఆరుగురిని బలితీసుకోగా బాపట్ల మండలంలోని స్టూవర్టుపురాన్ని విషాదంలో నింపింది. ప్రకాశం జిల్లా కొమరోలు మండలం తాటిచెర్లమోటు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో స్టూవర్టుపురానికి చెందిన ఓ కుటుంబంలో తల్లి, కొడుకు, కూతురితో పాటు వారి వెంట వెళ్లిన ముగ్గురు స్నేహితులూ మృతి చెందారు. కుమారుడికి అన్నప్రాశన చేసిన మరుసటి రోజే తండ్రి మృత్యువాత పడడం ఓ విషాదమైతే ప్రమాదంలో తల్లిని కోల్పోయి గాయాలతో ఇద్దరు పిల్లలు రోధించడం చూపరులను కలచివేసింది. స్టూవర్టుపురానికి చెందిన ఏడుగురు శుక్రవారం సాయంత్రం నంద్యాల జిల్లా డోన్‌కు వ్యక్తిగత పనుల నిమిత్తం కారులో వెళ్లారు. అక్కడ పని ముగించుకుని శనివారం ఉదయం స్టూవర్టుపురానికి అదే కారులో వారంతా తిరిగి వస్తుండగా మార్గమధ్యలో స్టూవర్టుపురానికి చెందిన భవాని తోడైంది. దీంతో మొత్తం ఎనిమిది మందితో వేగంగా వెళ్తున్న కారు తాటిచెర్లమోటు వద్ద ఎదురుగా వస్తున్న లారీని ఢీకొట్టింది. దీంతో సగంభాగం లారీ కిందకు వెళ్లిపోవడంతో కారును బయటకు తీయడానికే దాదాపు గంట పాటు శ్రమించాల్సి వచ్చింది. కారులోని ఒకే కుటుంబానికి చెందిన గజ్జెల అంకాలు(45), నరసింహ(23), మొగిలి భవాని(22), స్నేహితులైన గజ్జెల జోసఫ్(25), బచ్చుల సన్నీ(27), కారు నడుపుతున్న కర్రెద్దుల దివాకర్(24) అక్కడికక్కడే మృతి చెందారు. భవాని పిల్లలు శిరీష, సిద్దులు గాయాలతో బయటపడ్డారు. అతి వేగానికి తోడు నిద్రమత్తు వల్లే ఘోరం జరిగినట్లు పోలీసులు చెబుతున్నారు.

అన్నప్రాసన తర్వాత రోజే తండ్రి..

మృతి చెందిన గజ్జెల నరసింహకు వివాహమైన (మిగతా 6వ పేజీలో)



8

మునిసిపల్ విలీన గ్రామాల సమస్యకు
త్వరలో పరిష్కారం

- రాష్ట్ర పంచాయతీ రాజ్ కమిషనర్ ఎం.కృష్ణతేజ
- గణపవరం రక్షిత మంచి నీటి పథకం ఫిల్టర్ బాలువుల పరిశీలన
- మరమ్మతులకు నిధులు మంజూరు చేయాలని అధికారులకు ఆదేశం

ఫిల్టర్ బావులను పరిశీలిస్తున్న కమిషనర్ కృష్ణతేజ, ఎమ్మెల్యే పుల్లారావు

అధికారం.. ప్రజా సేవ కోసమే

- వెన్నంటి నిలిచిన వారి శ్రేయస్సే లక్ష్యం
- మినీ మహానాడులో ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర

పొన్నూరుటౌన్, మే 23 (ఆంధ్రజ్యోతి): ప్రజలు ఇచ్చిన అధికారం ప్రజా సేవకే వినియోగిస్తామని ఎమ్మెల్యే, సంగం డెయిరీ ఛైర్మన్ ధూళిపాళ్ల నరేంద్రకుమార్ తెలిపారు. చింతలపూడి డీవీసీ కల్యాణ మండపంలో శుక్రవారం టీడీపీ మినీ మహానాడు సమావేశం జరిగింది. ఎన్టీఆర్, ధూళిపాళ్ల వీరయ్యచౌదరి చిత్ర పటాలకు నివాళులు అర్పించిన అనంతరం నరేంద్ర ప్రసంగించారు. 2019-24 మధ్య ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నామన్నారు. వైసీపీ పాలనలో జరిగిన దోపిడీ, అక్రమాలపై నాడు ప్రశ్నించలేని పరిస్థితులు కల్పించారన్నారు. అయినా రాజీ లేకుండా అనేక పోరాటాలు సాగించినట్లు గుర్తుచేశారు. వైసీపీ నేతలు అధికారాన్ని ఉపయోగించుకుని అహంకారంతో దౌర్జన్యాలకు పాల్పడినా తలెత్తి నిలబడి తనతో పాటు పోరాడిన పార్టీ శ్రేణులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. అధికారం పూలపాన్పు కాదని, ముళ్లు కూడా ఉంటాయని నాయకులు, కార్యకర్తలు గుర్తించుకోవాలన్నారు. నాయకులు, కార్యకర్తలు బాధ్యతలు విస్మరించరాదన్నారు. 2014- 19 మధ్య జరిగిన తప్పులు పునరావృతం కాకుండా జాగ్రత్త పడాలని శ్రేణులకు సూచించారు. కష్టంలో ఉన్నప్పుడు వెన్నంటి నిలిచిన వారి శ్రేయస్సు కోసం పాటుపడాలన్నారు. 2019 నుంచి 24 మధ్య ఎవరి మీదైతే పోరాడామో వారే ప్రస్తుతం మిత్ర పక్షంలో ఉన్నారని అంతమాత్రాన వారి అక్రమాలను ఒదిలిపెట్టేదిలేదని హెచ్చరించారు.



మినీ మహానాడులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నరేంద్రకుమార్

శాంతిభద్రతల విషయంలో టీడీపీ, మిత్రపక్షాలు జోక్యం చేసుకోవద్దని సూచించారు. ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడితేనే భవిష్యత్ ఉంటుందని గుర్తు చేశారు. కూటమిగా పోరాడి అధికారంలోకి వచ్చినందున పదవులు పంపకంలో టీడీపీతో పాటు జనసేన, బీజేపీలను కలుపుకుని ముందుకు సాగుదామని శ్రేణులకు సూచించారు. సమావేశంలో పలు తీర్మానాలు చేసి ఆమోదించారు.

జూనియర్ లెక్చరర్లకూ.. స్థానచలనం

- బదిలీల షెడ్యూల్ జారీ చేసిన ప్రభుత్వం
- ఇంటర్ కళాశాలల్లోని నాన్ టీచింగ్ స్టాఫ్‌కూ..

గుంటూరు(విద్య), మే 23 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో పని చేసే అధ్యాపకులు, నాన్‌టీచింగ్ ఉద్యోగుల బదిలీలకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఈ మేరకు షెడ్యూల్‌ను ప్రభుత్వం విడుదల చేసింది. శుక్ర వారం నుంచి బదిలీల ప్రక్రియను ఇంటర్ బోర్డు అధికారులు ప్రారంభించారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. దీంతో ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధి లోని 23 ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో బదిలీల కోలాహలం నెలకొంది. ఆయా కళాశాలల్లో దాదాపు 500 మందికిపైగా పని చేస్తుండగా వారందరూ నిర్దేశించిన నిబంధనల ప్రకారం బదిలీల కోసం దరఖాస్తు చేసుకునే పనిలో నిమగ్న మయ్యారు. నిర్దేశించిన సమాచారం మాత్రమే అధ్యాపకులు, ప్రిన్సిపాల్, నాన్ టీచింగ్ సిబ్బంది అప్‌లోడ్ చేయాలని అందుకు విరుద్ధంగా బదిలీలకు దరఖాస్తు చేసుకుంటే క్రమశిక్షణా చర్యలు తీసుకుంటామని అధికారులు ఆదేశాలు జారీ చేశారు. దరఖాస్తు ప్రక్రియలో ఎదురయ్యే సాంకేతిక సమస్యలు పరిష్కరించేందుకు గుంటూరు లోని ఆర్జేడీ కార్యాలయంలో ఏర్పాట్లు చేశారు. ఈ నెల 27 నుంచి 29 వరకు వెబ్ ఆప్షన్స్ ద్వారా బదిలీలు కోరుకోవచ్చని, 31న అర్హులైన వారికి నియామక పత్రాలు అందజేస్తామని బోర్డు అధికారులు తెలిపారు. ఎంతమందికి స్థానచలనం అయ్యేది ఈ నెల 31 తేదీ తర్వాత తెలుస్తుందని ప్రభుత్వ జూనియర్ అధ్యాపకుల సంఘ నాయకులు తెలిపారు.



రైస్‌కార్డుల దరఖాస్తులను పరిష్కరించాలి



సచివాయలంలో రైస్‌కార్డుల దరఖాస్తుల నమోదు ప్రక్రియని పరిశీలిస్తున్న ఇన్‌చార్జి కలెక్టర్ భార్గవ్‌తేజ

గుంటూరు, మే 23 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రైస్ కార్డులకు సంబంధించి అందుబాటులోకి వచ్చిన నూతన కార్డుల మంజూరు, చిరునామాల మార్పు, కుటుంబ సభ్యుల చేర్పులు, విభజన, తొలగింపు, సరెండర్, అప్డేషన్ వంటి సర్వీసు దరఖాస్తులను మార్గదర్శకాల ప్రకారం పరిష్కరించాలని ఇన్‌చార్జి కలెక్టర్ భార్గవ్‌తేజ సచివాలయ ఉద్యోగులను ఆదేశించారు. శుక్రవారం నగర పాలకసంస్థ పరిధిలోని గోరంట్ల 183వ వార్డు సచివాలయంలో ఆయన రైస్‌కార్డు దరఖాస్తుల సర్వీసులను పరిష్కరిస్తున్న ప్రక్రియను పరిశీలించారు. దరఖాస్తులను రైస్ కార్డు మాడ్యూల్‌లో డేటా ప్రాసెసింగ్ సెక్రటరి కంప్యూటరులో నమోదు చేసే విధానాన్ని పరిశీలించారు. దరఖాస్తులు అందించడానికి సచివాలయానికి వచ్చిన ప్రజలతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. రైస్ కార్డుల సర్వీసులకు సంబంధించిన దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేసిన వెంటనే సంబంధిత కుటుంబ సభ్యుల ఈకేవైసీ చేయాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి డీఎస్‌వో చంద్రముని, తూర్పు మండల తహసీల్దారు సుభాని, సివిల్ సప్లయిస్ డీటీ భాస్కర్ పాల్గొన్నారు.


పోటీలో గెలుపొందిన విద్యార్థులతో ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్

విజ్ఞాన్స్ విద్యార్థులకు రాష్ట్రస్థాయి అవార్డులు

గుంటూరు (విద్య) మే 23 (ఆంధ్రజ్యోతి): చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీకు చెందిన మొదటి సంవత్సరం విద్యార్థుల కు రాష్ట్రస్థాయి అవార్డులు లభించాయని వర్సిటీ వైస్ చాన్సలర్, కల్నల్ ప్రొఫెసర్ పీ.నాగభూషణ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అంతర్జాతీయ జీవవైవిధ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని కేంద్ర పర్యావరణ కాలుష్య నియంత్రణ కేంద్రం (సీఈపీసీ) యూనివర్సిటీలోని రసాయన శాస్త్ర విభాగం, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బయోడైవర్సిటీ బోర్డుతో కలిసి విద్యార్థుల కోసం మూడు విభిన్న విభాగాలలో వ్యాస రచన, చిత్ర లేఖనం మరియు ఫొటోగ్రఫీ పోటీలు నిర్వహించారని తెలిపారు. ఈ పోటీలలో తమ యూనివర్సిటీకు చెందిన మొదటి సంవత్సరం బీటెక్ విద్యార్థులు చల్లా సంజనా (పెయింటింగ్), డీ.నరేంద్రనాథ్ (ఫోటోగ్రఫీ) విభాగాలలో రాష్ట్ర స్థాయి కేటగిరీలో పోటీపడి మొదటి విజేతలుగా నిలిచారన్నారు. వీరికి విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరిగిన కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి, పవన్ కల్యాణ్ చేతుల మీదుగా మెమెంటోలు, ప్రామాణిక పత్రాలు అందజేశారని తెలిపారు. విద్యార్థులను వర్సిటీ వైస్ చాన్సలర్, కల్నల్ ప్రొఫెసర్ పీ.నాగభూషణ్, ఆయా విభాగాల డీన్లు, అధిపతులు, అధ్యాపక సిబ్బంది అభినందించారు.

బస్సు ఢీకొని ఒకరు..రైలు కింద పడి మరొకరు..

నరసరావుపేట లీగల్, మే 23(ఆంధ్రజ్యోతి): గుంటూరు రోడ్డులో గురువారం రాత్రి గుంటూరు నుండి శ్రీశైలం వెళ్లే ఆర్టీసీ బస్సు ఢీకొని ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతినట్లు రెండో పట్టణ పోలీసులు శుక్రవారం తెలిపారు. బస్సు డ్రైవర్ అజాగ్రత్త, అతివేగం, నిర్లక్ష్యం వల్లే ఈ ప్రమాదం జరిగిందని చెప్పారు. మృ తదేహం నరసరావుపేట ఏరియా ప్రభుత్వ వైద్యశాలలోని శవాగారంలో ఉందని, ఆచూకీ తెలిసిన వారు నరసరావుపేట రెండో పట్టణ పోలీసులను సంప్రదించాలని పేర్కొన్నారు.

రైలు ఢీకొని..

సాతులూరు రైల్వేస్టేషన్ సమీపంలోని యార్డు వద్ద శుక్రవారం ఉదయం గుర్తుతెలియని రైలు కింద పడి గుర్తుతెలియని యువకుడు మృతి చెందినట్లు నరసరావుపేట రైల్వే పోలీసులు తెలిపారు. మృతుడు తెలుపు రంగు నిండు చేతుల చొక్కా, తెలుపు రంగు పంచ ధరించాడని పేర్కొన్నారు. మృతదేహాన్ని వినుకొండ గవర్నమెంట్ హాస్పిటల్ శవాగారంలో భద్రపరిచినట్లు చెప్పారు. ఆచూకీ తెలిసిన వారు నరసరావుపేట రైల్వే పోలీసులను సంప్రదించాలని పేర్కొన్నారు.

గుంటూరు, పల్నాడులో 1,900 లిక్కర్ కేసులు

● మద్యం దుకాణాల యజమానులు సమయపాలన పాటించాల్సిందే ● ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ డాక్టర్ కె.శ్రీనివాసులు

గుంటూరు కార్పొరేషన్, మే 23(ఆంధ్రజ్యోతి): గుంటూరు, పల్నాడు జిల్లాల్లోని బార్ అండ్ రెస్టారెంట్, వైన్ షాపుల యజమానులు తప్పనిసరిగా సమయపాలన పాటించాల్సిందేనని ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ డాక్టర్ కె.శ్రీనివాసులు స్పష్టం చేశారు. శుక్రవారం బ్రాడీపేటలోని శాఖ కార్యాలయంలో ఆయన విలేకర్ల సమావేశం నిర్వ హించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు మద్యం దుకాణాలు రాత్రి 10 గంటలకు ఖచ్చితంగా మూసేయాల్సిందేనని చెప్పారు. పర్మిట్ రూములకు అనుమతి లేదని, ఎవరైన పర్మిట్ రూములు ఏర్పాటు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బార్ అండ్ రెస్టారెంట్స్‌కు రాత్రి 11 గంటలకు లిక్కర్ సరఫరా.. ఆ తర్వాత ఒంటిగంట వరకు ఫుడ్ సరఫరాకు అనుమతి ఉందన్నారు. అనంతరం తప్పనిసరిగా మూసివేయాల్సిందేనన్నారు. సమయపాలన పాటిస్తున్నది.. లేనిది టాస్క్ ఫోర్స్ ప్రత్యేక బృందాలు పర్యవేక్షణ చేస్తాయని తెలిపారు. వీరిపై ఎక్సైజ్ సూపరింటెండెంట్, అసిస్టెంట్, డిప్యూటీ కమిషనర్ల పర్యవేక్షణ ఉంటుందన్నారు. ఎమ్మార్పీ కంటే అధిక ధరలకు విక్రయించే దుకాణాల లైసెన్స్ రద్దుకు చర్యలు తీసుకుంటామన్నారు. గతేడాది అక్టోబర్ నుంచి ఇప్పటి వరకు మొత్తం 1,900 కేసులు నమోదు చేసి, 1,201 మందిని అరెస్టు చేశామని తెలిపారు. ఇందులో మందు 2,297 లీటర్లు, బీరు 119 లీటర్లు, నాటుసారా 444 లీటర్లు స్వాధీనం చేసుకోవడం జరిగిందన్నారు. గంజాయి 2.89 గ్రాములు, కొకైన్ 8.5 గ్రాములు స్వాధీ నంతో చేసుకున్నామన్నారు. వీరి నుంచి మొత్తం 21 వాహనాలను సీజ్ చేశామని వివరాలు వెల్లడించారు. అసిస్టెంట్ కమి షనర్ రవికుమార్‌రెడ్డి, అసిస్టెంట్ సూప రింటెండెంట్ ఇ.మారయ్యబాబు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎక్సైజ్ డీసీ డాక్టర్ కె.శ్రీనివాసులు, అధికారులు

తీరని శోకం

(5వ పేజీ తరువాయి)

చాలా ఏళ్ల తర్వాత ఆరు నెలల క్రితమే సంతానం కలిగింది. బంధువులను అందర్నీ పిలుచుకుని చీరాల మండల పరిధిలోని ఓ దేవా లయంలో శుక్రవారమే వేడుకగా అన్నప్రాసన కూడా జరిపిం చారు. మరుసటి రోజే ఈ ఘోరం జరగడంతో స్టువర్టుపురంలోనే ఉన్న ఆయన భార్యతో పాటు బంధువులు కన్నీరుమున్నీరుగా విలపిస్తు న్నారు. నరసింహ భార్యను ఓదార్చడం ఎవరివల్లా కావడం లేదు.


మృతి చెందిన గజ్జల అంకాలు

స్నేహితుల బలవంతంపై వెళ్లి..

నరసింహ డోన్ వెళ్లే క్రమంలో స్నేహితులు ముగ్గుర్ని రమ్మని పిలిచాడు. వీరిలో సన్నీ అనే యువకుడు వెళ్లడానికి తొలుత అయిష్టత చూపగా మిత్రుల బలవంతం మీద వెళ్లినట్లు తెలుస్తోంది. అవివాహితులైన జోసఫ్, సన్నీ, దివాకర్‌లను మృత్యువు కాటేయడంతో వారి కుటుంబసభ్యుల రోదనలు మిన్నంటాయి. ఎబొనైజర్ దంపతులకు జోసఫ్ ఒక్కడే కుమారుడు. గ్రామంలో చిన్నపాటి ఫైనాన్స్ వ్యాపారం చేసుకుంటూ తల్లిదండ్రులకు చేదోడువాదోడుగా నిలిచాడు. ఉన్న ఒక్క కుమారుడు మృతి చెందడంతో తల్లిదండ్రుల బాధ అంతాఇంతా కాదు. సన్ని తండ్రి మృతిచెందగా తల్లి వ్యవసాయ కూలీగా చిన్న పనులు చేసుకుంటూ ముగ్గురు పిల్లలను పెంచి పోషిస్తున్నది. పెద్దకుమారుడైన సన్ని రోడ్డు ప్రమాదంలో మృతితో ఆ తల్లి గుండెలవిసేలా రోదిస్తుంది. సన్నికి పెళ్లి చేద్దామనుకుంటుండగా ఈ సంఘటన జరగడం ఆ కుటుంబాన్ని కలిచివేసింది. గ్రామంలో ఏ కార్యక్రమం అయినా నలుగురు స్నేహితులు కలిసే ఉండేవారని మృత్యువులోనూ ఒకరికొకరు తోడుగా ఉండడం తలచుకుని గ్రామస్థులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

చెట్టును ఢీకొన్న కారు..

పెదనందిపాడు: గుంటూరు పర్చూరు మార్గంలో పెదనందిపాడు సమీపంలో గార్లపాడు డొంక వద్ద శుక్రవారం వేకువజామున చెట్టును కారు ఢీకొని బాపట్ల జిల్లా చీరాల పేరాల గొల్లపాలేనికి చెందిన కీర్తి వెంకటరాజు(52) మృతి చెందాడు. బాపట్లలో ఇంటిలిజెన్స్ హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహించే వెంకటరాజు చీరాలకు చెందిన స్నేహితుడైన దివ్వెల వెంకటసుబ్రహ్మణ్యంగుప్తాతో కలిసి కారులో వెలగపూడి సెక్రటరియేట్‌కు వెళ్లి తిరిగి వస్తున్నాడు. ఈ క్రమంలో గార్లపాడు డొంక వద్ద ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి చెట్టును ఢీకొట్టారు. దీంతో వెంకటరాజు అక్కడికక్కడే మృతిచెందాడు. గాయపడిన వెంకటసుబ్రహ్మణ్యంగుప్తాను ఏఎస్ఐ బాలశౌరి 108లో చీరాల ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కుమార్తె స్వర్ణజసింహాయాదవ్ ఫిర్యాదు మేరకు ఎస్ఐ మధుపవన్ కేసు నమోదుచేశారు.


కీర్తి వెంకటరాజు (పాత చిత్రం)

స్నేహితుడి కోసం వెళ్తూ..

తెనాలిరూరల్: రైలులో తెనాలికి వస్తున్న స్నేహితుడ్ని తీసుకువచ్చేందుకు బైక్‌పై వెళ్తూ అంగలకుదురు గ్రామానికి చెందిన షేక్ సుభాని (24) అంగలకుదురు శివారు లో రోడ్డుపై ఆగి ఉన్న లారీని ఢీకొని మృతి చెందాడు. గురువారం అర్ధరాత్రి తర్వాత జరిగిన ప్రమాదంలో స్నేహితుడి కోసం వెళ్లి కానరాని లోకాలకు వెళ్లడంతో సుభాని కుటుంబసభ్యులు, స్నేహితులు కన్నీటిపర్యంతమయ్యారు. అందరితో కలివిడిగా ఉండే సుభాని అనుకోని ప్రమాదంలో మృతి చెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.



పెళ్లి ఫొటోలు తీసి వస్తూ..

చిలకలూరిపేట: పట్టణంలోని జాతీయ రహదారిపై గురువారం అర్ధరాత్రి జరిగిన ప్రమాదంలో నాదెండ్ల మండలం గణపవరానికి చెందిన జగ్గవరపు సంజయ్(22) అనే ఫొటోగ్రాఫర్ మృతి చెందాడు. పట్టణంలోని ఓ కల్యాణ మండపంలో పెళ్లి ఫొటోలు తీసి స్టూడియోకు వెళుతుండగా బైకు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొని మృతి చెందాడు.

తల్లిదండ్రులకు చేదోడుగా ఉంటూ..

తుళ్లూరు(రాయపూడి): రాయపూడి నుంచి తుళ్లూరుకు గ్రావెల్ లోడుతో వస్తున్న టిప్పర్ ఢీకొని తుళ్లూరుకి చెందిన అంకం అభిషేక్(13) అనే బాలుడు మృతి చెందాడు. స్థానిక ప్రభుత్వ పాఠశాలలో ఏడో తరగతి పూర్తి చేసిన అభిషేక్ గేదెలు మేపుకుంటూ జీవనం సాగించే తల్లిదండ్రులకు చేదోడుగా ఉంటున్నాడు. ఈ క్రమంలో శుక్రవారం రాయపూడి బంకులో మంచినీరు పట్టుకుని తిరిగి గేదెల వద్దకు వస్తుండగా టిప్పర్ ఢీకొట్టి బాలుడ్ని పది మీటర్ల మేర ఈడ్చుకుపోయింది. తల పొట్ట ఛిద్రం కావడంతో బాలుడు అక్కడికక్కడే మృతి చెందాడు, ఒక్కగానొక్క కుమారుడు మృతి చెందడంతో తల్లిదండ్రులు బోరున విలపించారు.


లారీకింద పడి దుర్మరణం చెందిన బాలుడు అభిషేక్

మీ బిడ్డలనైతే ఇలాగే చూసుకుంటారా?

దాచేపల్లి, మే 23 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రం నిర్వహణ, పర్యవేక్షణ లోపంతో బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు బి.పద్మావతి, పల్నాడు జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ ఉమాదేవి ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై వివరణ ఇవ్వాలని సూపర్ వైజర్‌కు షోకాజు నోటీసు ఇచ్చారు. దాచేపల్లిలోని నారా యణపురంలో ఉన్న అంజనాపురం అంగన్ వాడీ కేంద్రాన్ని బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు బి.పద్మావతి, పల్నాడు జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ ఉమాదేవి శుక్రవారం తనిఖీ చేశారు. అంగన్‌వాడీ కేంద్రం తెరవకపోవడం, అపరిశుభ్రత, ఆయా అందుబాటులో లేకపోవడం, హాజరు రికార్డు తదితర నిర్వహణ, పర్యవేక్షణ లోపాలను అధికారులు గుర్తించారు. ' మీ పిల్లలను ఏ విధంగా చూసుకుంటారో ఆ విధంగా చూసుకోండమ్మా' అని సిబ్బందికి సూచించారు. పర్యవేక్షణ లోపించిన సూపర్ వైజర్ వరలక్ష్మికి షోకాజ్ నోటీసు ఇచ్చారు. అంగన్ వాడీ కార్యకర్తను మందలించారు. ఈ పరిస్థితిని మొత్తం ఉన్నతాధికారులకు నివేదిస్తాని తెలిపారు. అనంతరం నడికూడి సచివాలయంలో కిశోరి బాలికా వికాసం కార్యక్రమంలో భాగంగా ఏఎన్ఎంలు, వైద్యులు, స్థానిక అధికారులతో సమావేశం నిర్వహించారు. డీసీపీవో శౌరిరాజు, సీడీపీవో అరుణ, పెద్దిరెడ్డి, నడికూడి సూపర్ వైజర్ వరలక్ష్మి, నాదెండ్ల సీడీపీవో నిర్మలారాణి, క్లస్టర్ హెచ్ఎం శ్యామలా కుమారి, దాచేపల్లి ఆర్ఐ శరత్ కుమార్ తదితరులు ఉన్నారు.

రైల్వేస్టేషన్లలో బిల్డింగ్‌లకు సేఫ్టీ చెక్ అవసరం

● గుంతకల్లు స్టేషన్‌లో పెచ్చులూడి బాలుడి మృతి
● ఈ సంఘటనతో అన్ని చోట్ల భవనాల పటిష్టతని తనిఖీ చేయించాలి

గుంటూరు, మే 23 (ఆంధ్రజ్యోతి): వర్షాల వలన భవనాలు, ప్రహరీగోడలు నాని పెచ్చులూడుతుంటాయి. అయితే అవి కిందపడిన సమయంలో అక్కడ ఎవరూ లేకుంటే చాలా తేలికగా తీసుకొంటారు. అదే పెచ్చులూడి ఎవరి పైన అయినా పడితే అది ప్రాణానికే ప్రమాదం. ఇలాంటి దుర్ఘటనే శుక్రవారం గుంతకల్లు రైల్వేస్టేషన్‌లో జరిగింది. ఏడేళ్ల బాలుడిపై పెచ్చులూడి పడటంతో అక్కడికక్కడే మృత్యువాత పడ్డాడు. ఈ సంఘటన రైలు ప్రయాణీకులను భయాందోళనకు గురి చేస్తున్నది. గుంటూరు రైల్వే డివిజన్‌లోనూ పలుచోట్ల పాత భవనాలు ఉన్నాయి. వర్షాలు కురిసినప్పుడు వాటి నుంచి నీరు కిందికి దిగుతుంటుంది. ముఖ్యంగా కంకరగుంట ఆర్‌యూబీ, నిన్న కాక మొన్న నిర్మించిన మూడొంతెనల ఆర్‌యూబీ కింద కూడా ఇలాంటి పరిస్థితే. ఈ నేపథ్యంలో వర్షం నీరు లీకేజిని అరిక ట్టకపోతే గుంతకల్లు రైల్వేస్టేషన్ లాంటి ప్రమాదాలు ఇక్కడ కూడా జరిగేందుకు ఆస్కారం ఉన్నది.

గుంటూరు రైల్వేస్టేషన్‌లో నూతన భవనాలే కాకుండా దశాబ్దాల క్రితం నిర్మించిన పాతవి కూడా ఉన్నాయి. నాల్గో నంబరు ప్లాట్‌ఫాంపై ఇవి కేంద్రీకృతమై ఉన్నాయి. ఇక్కడ ఎక్కువగా క్రూ సిబ్బంది విధులకు హాజరయ్యేందుకు వస్తుంటారు. అలానే పాత ఫుట్ బ్రిడ్జీ ఒకటి ఉన్నది. నల్లపాడు, పేరేచర్ల, నంబూరు, మంగళగిరి, రేపల్లె, వేమూరు తదితర రైల్వేస్టేషన్లలోనూ పాత కట్టడాలు ఉన్నాయి. నంద్యాల, నడికుడి మార్గంలోనూ రైల్వేస్టేషన్లలో పాత భవనా లు ఉన్నాయి. ఇటీవలే అమృత్ స్టేషన్ల స్కీమ్ కింద డివిజన్ పరిధిలో 16 రైల్వే స్టేషన్ల నూతన భవనాల నిర్మాణాలను రూ. 300 కోట్లతో ప్రారంభించారు.

రైల్వేస్టేషన్లలో తగినన్ని వెయిటింగ్ హాల్స్ లేకపోవడంతో ప్రయాణీకులు ఎక్కువగా ప్లాట్‌పాంల పైనే కూర్చుంటుంటారు. జనరల్ కేటిగిరీ ప్రయాణీకులు అయితే ఒక కునుకు కూడా వేస్తుంటారు. ఆర్‌యూబీలు నిర్మాణం చేసేటప్పుడు తగినన్ని జాగ్రత్తలను రైల్వే శాఖ తీసుకోవడం లేదు. నిబంధనల ప్రకారం రైలుపట్టాలపై నుంచి చుక్కనీరు కూడా కిందికి దిగరాదు. అయితే ఇటీవల కాలంలో ఆర్‌సీసీ బ్లాకులతో ఈ ఆర్‌యూబీలు నిర్మిస్తూ ఒకదానితో ఒకటిని అతికిస్తున్నారు. ఈ క్రమంలో జాయింట్స్ సరిగా జరగక వర్షం కురిస్తే నీరు కిందికి దిగుతూ ప్రమాదకరంగా మారుతున్నది. ఇప్పటికే అడపాదడపాగా వర్షాలు కురుస్తు న్న నేపథ్యంలో తక్షణమే రైల్వే అధికారులు సేఫ్టీ చెక్ చేపట్టి అన్ని భవనాల పటిష్టతను పరిశీలించాల్సిన అవసరం ఏర్పడింది. గుంతకల్లు స్టేషన్ దుర్ఘటనతో డీఆర్ఎం సుధేష్ణ సేన్ ఈ విషయంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి తనిఖీలు చేయించి అవసరమైన మరమ్మతులు చేపట్టి పూర్తి చేయించాలని రైల్వే వినియోగదారుల సంఘాల నాయకులు సూచిస్తున్నారు.

బాలికపై లైంగిక దాడి

- యువకుడిపై పోక్సో కేసు

యడ్లపాడు, మే 23 (ఆంధ్రజ్యోతి): బాలికపై లైంగిక వేధింపులకు పాల్పడిన యువకుడిపై పోక్సో చట్టం కింద పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్ఐ శివరామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. గుంటూరు జిల్లా ఫిరంగిపురం మండలం హౌస్‌గణేష్‌పాడుకు చెందిన ఆళ్ల కొండలు అనే యువకుడు గత నెల 15న మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలికను మోసపూరిత మాటలతో సుదూర ప్రాంతాలకు తీసుకెళ్లి లైంగిక దాడిక పాల్పడ్డాడు. విషయం తెలుసుకున్న బాలిక కుటుంబ సభ్యులు ఫిర్యాదు ఆధారంగా విచారణ చేపట్టిన పోలీసులు.. సాంకేతిక ఆధారాలతో పాటు వాంగ్మూలాలు సేకరించారు. నిం దితుడిని ఈ నెల 22న పల్నాడు జిల్లా యడ్లపాడు మండలం బోయపాలెం గ్రామంలో అదుపులోకి తీసుకున్నారు. శుక్రవారం చిలకలూరిపేటలోని అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) కోర్టులో హాజరు పరచగా నిందితుడికి జూన్ 5 వరకు రిమాండ్ విధించినట్లు ఎస్ఐ తెలిపారు.

వ్యవసాయ శాఖలో బదిలీల సందడి

గుంటూరు సిటీ, మే 23(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలోని వ్యవసాయ శాఖలో బదిలీల సందడి నెలకొంది. బదిలీ కోసం దరఖాస్తు చేసుకున్న వారికి జిల్లా వ్యవసాయ అధికారి కార్యాలయంలో శుక్రవారం కౌన్సెలింగ్ నిర్వహించారు. మొదటి విడతలో జూనియర్ అసిస్టెంట్‌లు, టైపిస్టులు, అటెండర్లకు స్థాన చలనం కలిగింది. ఉమ్మడి జిల్లా పరిధిలో బదిలీకి అర్హత పొందిన మినిస్టీరియల్ సిబ్బంది 17 మంది, నాలుగవ తరగతి సిబ్బంది 10 మందికి బదిలీ ప్రక్రియ నిర్వహించినట్లు జిల్లా వ్యవసాయ అధికారి నున్న వెంకటేశ్వర్లు తెలిపారు. బాపట్ల , పల్నాడు జిల్లాల వ్యవసాయశాక అధికారులు రామకృష్ణ, మురళి, పరిపాలన అధికారి వి.ఎస్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఉదరకుహర వ్యాధులకు అరుదైన శస్త్రచికిత్సలు

● ఇద్దరు బాధితులకు జీజీహెచ్‌లో ఊరట

గుంటూరు మెడికల్, మే 23 (ఆంధ్రజ్యోతి): అన్నవాహికలో నరాలు దెబ్బ తినడం వల్ల అక్లాషియా కార్డియా అనే అరుదైన జబ్బుకు గురై పదేళ్లుగా ఘనాహారం తీసుకోలేక బాధపడుతున్న మహిళకు గుంటూరు ప్రభుత్వ సమగ్రాస్పత్రిలో వైద్యులు శస్త్రచికిత్సతో ఉపశమనం కలిగించారు. వివరాల్లోకి వెడితే.. మాచర్లకు చెందిన శాంతమ్మ (40) అక్లాషియా కార్డియా అనే జబ్బు బారిన పడటంతో పదేళ్లుగా ఘనాహారం తీసుకోలేకపోతోంది. కేవలం నీరు, మజ్జిగ, కొబ్బరి నీరు, జావ తీసుకుంటూ జీవిస్తోంది. ఇటీవల ఆమె చికిత్స కోసం గుంటూరు జీజీహెచ్‌కు వచ్చారు. సర్జికల్ గ్యాస్ట్రో ఎంటిరాలజిస్ట్ డాక్టర్ అందె కోటి వెంకటేశ్వరరావు ఆమెను పరీక్షించి హెల్లర్ కార్డియోమయోటమీ ఆపరేషన్ చేయడంతో శాంతమ్మ పూర్తిగా కోలుకున్నారు. ప్రస్తుతం ఆమె అన్నం, ఇతర ఘన ఆహార పదార్థాలు తీసుకుంటున్నారు. మరో కేసులో మాచర్లకు చెందిన దుర్గా అనే యువతి యాసిడ్ తాగడం వల్ల అన్నవాహిక, జీర్ణాశయం పూర్తిగా మూసుకుపోయాయి. దీంతో ఆహారం తీసుకోలేక ఆమె ఇబ్బందులు పడుతోంది. ఇటీవల జీజీహెచ్‌కు రాగా, డాక్టర్ అందె కోటి వెంకటేశ్వరరావు ఆమెకు ఆపరేషన్ చేశారు. మూసుకుపోయిన పేగులు తొలగించి ఆ స్థానంలో చిన్న పేగును అమర్చారు. ఆపరేషన్ తర్వాత దుర్గా ఆహారం చక్కగా తీసుకుంటున్నారు. అరుదైన ఈ రెండు కేసుల్లో క్లిష్టమైన శస్త్రచికిత్సలు చేసిన సర్జికల్ గ్యాస్ట్రోఎంటిరాలజీ వైద్యులను సూపరింటెండెంట్ డాక్టర్ రమణ యశస్వి అభినందించారు.


కోలుకున్న రోగులతో డాక్టర్లు

జైలు పరిచయం.. ముఠాగా ఏర్పడి చోరీలు

చోరీ నిందితుల అరెస్ట్ - వెండి కిరీటం స్వాధీనం

తెనాలి రూరల్, మే23 (ఆంధ్రజ్యోతి): వివిధ నేరాలకు పాల్పడి.. జైలు శిక్ష అనుభవిస్తూ అక్కడ ఏర్పడిన పరిచయంతో విడుదలైన తర్వాత ము ఠాగా ఏర్పడి చోరీలకు పాల్పడుతున్న నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. రూరల్ ఎస్ఐ ఆనంద్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ఖాజీపేట శ్రీలక్ష్మీమైసమ్మ అమ్మవారి ఆలయంలో ఈ నెల 2న అర్ధరాత్రి తాళాలు పగలగొట్టి అమ్మవారి వెండి కిరీటం, నగలు దుండగులు అపహరించుకుపోయారు. ఆలయ నిర్వాహకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, పోలీసులు విచారణ చేపట్టారు. నల్లపాడు పోలీసులు దొంగతనం కేసుల్లో అనుమానితులను పట్టుకోగా ఖాజీపేట చోరీ విషయం వెలుగులోకి వచ్చింది. తెలంగాణలోని మిర్యాలగూడకు చెందిన నార్సింగ గంగాధర్, నార్సింగ్ మహేష్, పల్నాడు జిల్లా పెదకూరపాడు మండలానికి చెందిన వేమవరపు విద్యాసాగర్, తెనాలి చంద్రబాబునాయుడు కాలనీకి చెందిన కారంపూడి విజయ్‌కుమార్, బాపట్ల జిల్లా రేపల్లెకి చెందిన పుట్టా వెంకటేష్.. ఈ ఐదుగురు కలిసి చేసినట్లు విచారణలో వెల్లడైంది. అమ్మవారి వెండి కిరీటాన్ని రికవరీ చేసి, నిందితులను తెనాలి న్యాయస్థానంలో హాజరుపరచగా న్యాయమూర్తి రిమాండ్ విధించినట్లు ఎస్ఐ ఆనంద్ తెలిపారు.


పట్టుబడ్డ నిందితులు

కొండవీడు, అమరావతి ఎక్స్‌ప్రెస్‌లకి శాశ్వత అదనపు బోగీలు

గుంటూరు, మే 23 (ఆంధ్రజ్యోతి): వారంలో మూడు రోజుల పాటు గుంటూరు మీదగా రాకపోకలు సాగించే మచిలీపట్నం - యశ్వంత్‌పూర్ కొండవీడు ఎక్స్‌ప్రెస్‌కి శాశ్వత ప్రాతిపదికన ఒక అదనపు ఏసీ త్రీటైర్ బోగీని రైల్వే శాఖ జోడించింది. దీంతో త్రీటైర్ ఏసీ భోగీల సంఖ్య ఏడుకు పెరిగింది. నిత్యం నరసపూర్ - హుబ్లీ మధ్యన రాకపోకలు సాగించే అమరావతి ఎక్స్‌ప్రెస్‌కి రెండు ఏసీ టూటైర్, ఒక స్లీపర్ అదనపు భోగీలు ఏర్పాటు చేసింది. దీంతో ఏసీ టూటైర్ నాలుగు, స్లీపర్ క్లాస్ భోగీలు 10కి పెరిగాయి.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.30 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	125, 134, 145
చికెన్ విత్ స్కిన్(కిలో)	236.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	246.00

ఇండియన్ బ్యాంక్ ALLAHABAD
తెనాలి బ్రాంచి
బలిజెవారిపాలెం, మోరీస్ పేట, తెనాలి, గుంటూరు జిల్లా.

స్థిరాస్తుల అమ్మకం కొరకు అమ్మకం ప్రకటన

APPENDIX- IV-A (రూల్ 8 (6)/9(1)" కి గా నిబంధనతో చూచుట) (ఏది వర్తిస్తుందో అలాగే చూడగలరు) సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 యొక్క రూల్ 8(6)/9(1) (ఏది వర్తిస్తుందో అలాగే చూడగలరు)లోని నిబంధనలతో చదువుకోవలసిన సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ & ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 క్రింద స్థిరాస్తుల అమ్మకము కొరకు ఈ-వేలం అమ్మకం ప్రకటన)

సెక్యూర్డ్ క్రెడిటార్స్ ఇండియన్ బ్యాంక్, తెనాలి బ్రాంచి వారికి శ్రీమతి గరికపాటి అనుషా (ఋణగ్రహీత) మరియు శ్రీ గరికపాటి వెంకటరావు (సహ-ఋణగ్రహీత) వారు ది. **21-05-2025** నాటికి చెల్లించవలసిన బకాయి మొత్తము **రూ.38,67,658/-** (అక్షరాలా ముప్పై ఎనిమిది లక్షల అరవై ఏడు వేల ఆరు వందల యాభై ఎనిమిది రూపాయలు మాత్రమే) వసూలు కొరకు సెక్యూర్డ్ క్రెడిటార్ అయిన ఇండియన్ బ్యాంక్, తెనాలి బ్రాంచి యొక్క అధీకృత అధికారి వారిచే భౌతికంగా/నిర్మాణాత్మకంగా స్వాధీనత (ఏది వర్తిస్తే అది) పరచుకోబడిన బ్యాంక్ తనఖా / ఆధీనంలో ఉన్న దిగువ వివరించిన స్థిరాస్తులను **"ఎక్కడ ఎలా ఉన్నది అలానే" "ఏది ఎలా ఉంటే అలానే"** మరియు **"అక్కడ ఏది ఉన్నదో అది"** పద్ధతి పై తేది. **11-06-2025**న విక్రయించబడునని యావన్మంది ప్రజానీకానికి మరియు ప్రత్యేకంగా ఋణగ్రహీత(లు) మరియు హామీదారు(లు) ఇందుమూలముగా సూచించడమైనది.

స్థిరాస్తి వివరములు

ఆస్తి-1: తనఖా పెట్టబడిన ఆస్తులు : డాక్యుమెంట్ నెం. (494/2018):
1వ ఐటమ్: గుంటూరు జిల్లా, తెనాలి రిజిస్ట్రేషన్ జిల్లా, తెనాలి మున్సిపాలిటీ, 8వ వార్డు, 10వ బ్లాక్, టీఎస్ నెం. 518/3లోని మొత్తం 968.00 చదరపు గజాలలో 37.00 చదరపు గజాలు లేదా 30.93 చదరపు మీటర్ల అవిభాజ్య వాటా స్థలం. షెడ్యూల్డ్ ఆస్తికి హద్దులు: **తూర్పు:** షేక్ రసూల్ గారి ఆస్తి కొంతవరకు & కట్టారి మోహనరావు గారి ఆస్తి కొంతవరకు – 264.00 అడుగులు. **దక్షిణం:** మున్సిపల్ రోడ్డు – 33.00 అడుగులు, **పడమర:** గంట హనుమయ్య గారి ఆవుల పాక కొంతవరకు & ప్రభుత్వ ఆసుపత్రి కొంతవరకు – 264.00 అడుగులు, **ఉత్తరం:** మున్సిపల్ రోడ్డు – 33.00 అడుగులు. **2వ ఐటమ్:** శ్రీ గోకులం అపార్ట్‌మెంట్, 3వ బ్లాక్, 3వ అంతస్తు, దగ్గర డోర్ నెం. 1-26-5, ఫ్లాట్ నెం.303 లోని 1114 చదరపు అడుగుల ఆర్.సీ.సీ భవనం (ఫ్లింత్ ఏరియా + కామన్ ఏరియా + కార్ పార్కింగ్ ఏరియా). షెడ్యూల్డ్ ఆస్తికి హద్దులు: **తూర్పు:** శూన్యాకాశము, **దక్షిణం:** ఉమ్మడి కారిడార్ కొంతవరకు, లిఫ్ట్ & మెట్లు కొంతవరకు, **పడమర:** శూన్యాకాశము, **ఉత్తరం:** శూన్యాకాశము.

ఆస్తి పై తాకట్టు రుణభారాలు : లేవు	రిజర్వు ధర: రూ.35,00,000/-
ధరావత్తు : రూ.3,50,000/-	బిడ్ పెంపుదల మొత్తం : రూ. 10,000/-
ఈ-వేలం తేది & సమయం : 11-06-2025 – ఉ. 10 గం. నుండి మ. 4 గం.లకు	
ప్రాపర్టీ ఐడి.నెం: IDIB6602520831	

బిడ్డరు దారులు సంబంధిత ఇ-వేలం సర్వీసు ప్రొవైడర్ **PSB Alliance Pvt. Ltd.** వారి వెబ్‌సైట్ **(https://baanknet.com)** ను సందర్శించగలరు. ఆన్‌లైన్ బిడ్‌లో పాల్గొనడానికి, సాంకేతిక సహాయం కోసం దయచేసి **82912 20220**కి కాల్ చేయండి. రిజిస్ట్రేషన్ స్థితి, బయానా స్థితిని తెలుసుకొనుటకు support.baanknet@psballiance.com. కు ఇమెయిల్ లో సంప్రదిరచగలరు.

ఆస్తి వివరాలు మరియు ఆస్తికి సంబంధించిన ఫోటోలు మరియు వేలం నియమ నిబంధనలు కొరకు **https://baanknet.com** మరియు పోర్టల్‌కు సంబంధించిన వివరణల కొరకు దయచేసి **PSB Alliance Pvt. Ltd.** ను సంప్రదించండి. కాంటాక్ట్ నెం: **8291220220.**

బిడ్డర్లు ఆస్తికి సంబంధించిన పైన తెలుపబడిన ఐడి నెంబర్లు ఉపయోగించి వెబ్‌సైట్ **https://baanknet.com** నందు సంప్రదించగలరు.

తేది: 23-05-2025
ప్రదేశము: గుంటూరు

అధీకృత అధికారి
ఇండియన్ బ్యాంక్

గుండెజబ్బులపై రేపు ఆరోగ్యసభ

గుంటూరు, మే 23(ఆంధ్రజ్యోతి): గుండె పోటు, గుండెజబ్బుల సమస్యలపై ఆదివారం అరండల్‌పేట 15/1వ లైనులోని అవగాహన సంస్థ కార్యాలయంలో ఆరోగ్యసభ నిర్వహించనున్నట్లు సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. సభలో కార్డియాలజిస్టు డాక్టర్ ఆకుల శివప్రసాద్ ప్రధానవక్తగా హాజరై ప్రసంగిస్తారన్నారు. ప్రపంచంలోనే నెంబర్ వన్ కిల్లర్‌గా పేరు గాంచిన గుండెపోటు, గుండెజబ్బుల గురించి సమగ్ర అవగాహన కల్పిస్తారన్నారు. గుండెజబ్బులు రాకుండా ముందుగా తీసుకోవాల్సిన జాగ్రత్తలతో పాటు సందేహాలను కూడా నివృత్తి చేస్తారన్నారు.

జగన్ పాలనలో వివక్షకు గురైన ఎస్సీ, ఎస్టీలు

- మూడావత్ శ్రీనునాయక్

గుంటూరు, మే 23 (ఆంధ్రజ్యోతి): గడిచిన ఐదేళ్లలో జగన్ రెడ్డి అరాచక పాలనలో ఎస్సీ ఎస్టీలు వివక్షతకు గురై సమాజంలో ఆర్థికంగా ఎంతో వెనకబడ్డారని టీడీపీ ఎస్సీ సెల్ నాయకుడు మూడావత్ శ్రీనునాయక్ అన్నారు. పార్టీ జిల్లా కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. వైసీపీ నాయకులు జగన్‌రెడ్డి అండతో ఎంతోమంది ఎస్సీ, ఎస్టీలను బలి తీసుకున్నారని ఆరోపించారు. గత ఐదేళ్ల రాక్షస పాలన అంతమయ్యేందుకు ఎస్సీ, ఎస్టీలు ప్రధాన పాత్ర పోషించి నేడు కూటమి ప్రభుత్వం 164 స్థానాల భారీ విజయాన్ని అందుకోవటానికి కారణమయ్యారన్నారు. టీడీపీని, చంద్రబాబు నాయకత్వాన్ని బలపరుస్తూ ఎస్సీ ఎస్టీలు ఐక్యతతో మహానాడును జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. సమావేశంలో బత్తుల భాస్కర్ పాల్గొన్నారు.

ప్రాంగణ ఎంపికల్లో ఆర్‌వీఆర్ జేసీ విద్యార్థులకు ఉద్యోగాలు

గుంటూరు (విద్య) మే 23 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ ఫార్మా సంస్థ గ్రాన్యూల్స్ ఇండియా నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూలో ఆర్‌వీఆర్ అండ్ జేసీ విద్యార్థులు ఉద్యోగాలు సాధించారని కళాశాల అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, రాయపాటి గోపాలకృష్ణ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కెమికల్ ఇంజనీరింగ్ విద్యార్థులు 13 మంది ఉద్యోగాలు సాధించినట్లు తెలిపారు. రూ.3 లక్షల ప్యాకేజీతో ఉద్యోగాలు లభించాయని వివరించారు. ఉద్యోగాలు సాధించిన విద్యార్థులను కళాశాల డైరెక్టర్ ఫైనాన్స్ అండ్ అడ్మినిస్ట్రేషన్ డాక్టర్ ఎన్‌వీ శ్రీనివాసరావు, కెమికల్ ఇంజనీరింగ్ ఇన్‌చార్జి విభాగాధిపతి డాక్టర్ కె.రమేష్ చంద్ర, కళాశాల ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ ఆఫీసర్స్ సీహెచ్ శ్రీనివాసరావు, డాక్టర్ కె.సురేష్ బాబు తదితరులు అభినందించారు.


కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ నిరసన

గుంటూరు సిటీ, మే 23 (ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ పరిధిలోని కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ నిర్వహిస్తున్న నిరసన కార్యక్రమాలు గురువారం నాటికి 26 రోజులకు చేరాయి. గుంటూరు కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్న కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వం న్యాయబద్ధమైన డిమాండ్స్ పరిష్కరించాలని కోరారు. 23 శాతం జీతాలు పెంపు, పెండింగ్‌లో ఉన్న ప్రోత్సాహకాలు వెంటనే చెల్లించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఎంసీఏ జిల్లా అధ్యక్షురాలు ప్రవళిక, చీఫ్ అడ్వయిజర్ కొడాలి సృజన, ఉపాధ్యక్షురాలు వనజ, షరీఫ్ పాల్గొన్నారు.

క్రైస్తవుల సమస్యలపై ప్రభుత్వం దృష్టి సారించాలి

గుంటూరు(తూర్పు), మే 23(ఆంధ్రజ్యోతి): క్రైస్తవులపై దాడులు, వారు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రభుత్వం దృష్టి సారించాలని సామాజికవేత్త డాక్టర్ గోళ్లమూడి రాజా సుందరంబాబు కోరారు. స్థానిక ఎల్‌ఈఎం మైదానంలో పాస్టర్ ప్రవీణ్ మృతిపై విచారణ జరిపించాలని, నగరంలో క్రైస్తవ సమాధులకు స్థలాల్ని కేటాయించాలని కోరుతూ దళిత సంఘాల ఆధ్వర్యంలో శనివారం సభ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ క్రైస్తవుల మృతదేహాలను ఖననం చేసేందుకు నగరంలో అంగుళం భూమి కూడా లేదని ఆవేదన వ్యక్తం చేశారు. క్రైస్తవుల రక్షణకు పాస్టర్ ప్రవీణ్ పేరున ప్రత్యేక చట్టం తీసుకురావాలని కోరారు. క్రైస్తవ హక్కుల పరిరక్షణ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు మద్దు ప్రేమ జ్యోతిబాబు మాట్లాడుతూ ప్రవీణ్ మృతిపై క్రైస్తవ సమాజంలో నెలకొన్న అనుమానాలను తొలగించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. జూన్ 23న పల్నాడు జిలా, సత్తెనపల్లి మండలం, పెదమక్కెన గ్రామంలో క్రైస్తవులు, దళితులు ఎదుర్కొంటున్న సమస్యలపై బహిరంగ సభను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. సభలో పాస్టర్లు బాబురావు, జి.సతీష్ బాబు, పూదోట చిన్నయ్య, జి.గాబ్రియల్, ఇమ్మానుయేల్, గద్దె రత్నశ్రీ, మార్కు తదితరులు పాల్గొన్నారు.

జీజీహెచ్‌లో గుర్తు తెలియని వ్యక్తి మృతి


గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

గుంటూరు, మే 23 (ఆంధ్రజ్యోతి): జీజీహెచ్‌లో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. చిరునామా తెలియని సుమారు 45 నుండి 50 సంవత్సరాల వయసు కలిగిన మగ వ్యక్తి 23న జీజీహెచ్‌లో అపస్మారక స్థితిలో ఉండగా అక్కడి వారు డాక్టర్‌కి చూయించగా డాక్టర్ పరీక్షించి చనిపోయినట్లుగా చెప్పారు. మృతుడి ఆచూకీ నిమిత్తం మృతదేహాన్ని గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రి శవాగారంలో భద్రపరచారు. మృతుని ఆచూకీ తెలిసినవారు కొత్తపేట పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలన్నారు. కొత్తపేట సీఐకు 8688831320, కొత్తపేట పోలీస్ స్టేషన్‌ను 08632221815లో సంప్రదించాలన్నారు.

ఎంఎస్‌ఎంఈ క్లస్టర్లను అభివృద్ధి చేయాలి

- ఇన్‌ఛార్జ్ కలెక్టర్ భార్గవ్ తేజ


కలెక్టరేట్‌లోని డీఆర్‌సీ మీటింగ్ హాల్‌లో జరిగిన జిల్లా పరిశ్రమల ప్రోత్సాహక కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌ఛార్జ్ కలెక్టర్ భార్గవ్ తేజ

గుంటూరు, మే 23 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించేందుకు ప్రతి నియోజకవర్గంలో ఎంఎస్‌ఎంఈ క్లస్టర్ అభివృద్ధి కార్యక్రమంలో పరిశ్రమల ఏర్పాటుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఇన్‌ఛార్జ్ కలెక్టర్ ఏ.భార్గవ్ తేజ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని డీఆర్‌సీ సమావేశ మందిరంలో శుక్రవారం ఇన్‌ఛార్జ్ కలెక్టర్ అధ్యక్షతన జిల్లా ఇండస్ట్రీయల్ అండ్ ఎక్స్‌పోర్ట్ ప్రమోషన్ కమిటీ(డీఐఈపీసీ) సమావేశం జరిగింది. ఈ సమావేశంలో అజెండాకు సంబంధించి చర్చించిన అంశాలపై ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఎంఎస్‌ఎంఈ క్లస్టర్లు ఏర్పాటుకు అనుకూలమైన భూములను పరిశ్రమలు, రెవెన్యూ శాఖ అధికారులు సమన్వయం చేసుకుంటూ వెంటనే గుర్తించాలన్నారు. మంగళగిరి నియోజకవర్గంలో గోల్డ్‌స్మిత్, హ్యాండ్లూమ్ క్లస్టర్ ఏర్పాటుకు వేగవంతం చేయాలన్నారు. గోల్డ్ స్మిత్ క్లస్టర్‌కు సంబంధించి డీపీఆర్ పూర్తి చేసి అనుమతి కోసం కేంద్ర ప్రభుత్వానికి పంపించడం జరిగిందని, ఇందుకు సంబంధించి అనుమతి రావాల్సి ఉందని జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ జయలక్ష్మి తెలిపారు. పీఎంఈజీపీ పథకం కింద 41 ఎంఎస్‌ఎంఈలు లక్ష్యం కాగా 170 మంజూరు చేయడం జరిగిందని, ఇందులో 101 ఎంఎస్‌ఎంఈలకు రూ.672.68 లక్షలు మంజూరు చేసిన రుణాలు వెంటనే అందించి యూనిట్లు గ్రౌండింగ్ అయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో 27 ఎంఎస్‌ఎంఈ పరిశ్రమలకు పెట్టుబడి రాయితీ, వడ్డీ, విద్యుత్, సేల్స్ ట్యాక్స్, స్టాంపుడ్యూటీ చెల్లింపులకు సంబంధించి రూ.2,62,33,590లు మంజూరు చేస్తూ సమావేశంలో ఇన్‌ఛార్జ్ కలెక్టర్ ఆమోదించారు. కామన్ ఫెసిలిటీ సెంటర్ (సీఎఫ్‌సీ) కింద మేడికొండూరు, చేబ్రోలు, తెనాలి, మంగళగిరి, ప్రత్తిపాడు మండలాల్లో 361.4 ఎకరాలు ఏపీఐఐసీ భూములు లభ్యం కానందున పెండింగ్‌లో ఉంచాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ జయలక్ష్మి, లీడ్ బ్యాంకు మేనేజరు మహిపాల్ రెడ్డి, జిల్లా భూగర్భ జలవనరుల శాఖ డిప్యూటీ డైరక్టర్ వందనం, కమర్షియల్ టాక్స్ డిప్యూటీ కమిషనర్ బీహెచ్ మనోరమ, చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ కే.రాంబాబు, కార్మిక శాఖ సహాయక కమిషనరు కృష్ణవేణి, ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు యేల్చూరి వెంకటేశ్వర్లు, బీఎంపీపీఎస్‌ఎఫ్‌సి కే అనిత, జెడ్‌ఎం ఏపీఐఐసీ డాక్టర్ ఎంఎల్ నరసింహారావు, డీపీవో సాయికుమార్, జిల్లా వ్యవసాయ అధికారి ఎన్.వెంకటేశ్వర్లు, ఆర్డీవో కే.శ్రీనివాసరావు, ఎస్ఎస్‌సీఐ రీజినల్ హెడ్ జి.పరిమళ, ఎఫ్ఏపీఎస్ఐఏ కో ఆర్డినేటర్ అజయ్ కుమార్ పాల్గొన్నారు.


డ్రెయిను పరిశీలిస్తున్న కమిషనర్ పులి శ్రీనివాసులు

డ్రెయిన్లలో పూడికతీత పనులు వేగవంతం చేయాలి

- కమిషనర్ పులి శ్రీనివాసులు

గుంటూరు కార్పొరేషన్, మే 23(ఆంధ్రజ్యోతి): గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో అవుట్ ఫాల్ డ్రెయిన్లలో పూడికతీత పనులు వేగవంతం చేయాలని, మైనర్ డ్రెయిన్లు అవుట్ ఫాల్ డ్రెయిన్లలో కలిసే ప్రాంతాల్లో ప్లాస్టిక్, ఇతర వ్యర్థాలు రాకుండా మెష్‌లను తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. కమిషనర్ శుక్రవారం శాంతి నగర్, రత్నపురి కాలనీ, ముత్యాలరెడ్డి నగర్ తదితర ప్రాంతాల్లో పర్యటించి పారిశుధ్య పనులను పరిశీలించి తీసుకోవాల్సిన చర్యలపై సంబంధిత అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. కమిషనర్ తొలుత శాంతినగర్‌లో అవుట్ ఫాల్ డ్రెయిన్ పొంగి మురుగు ఇళ్లల్లోకి వస్తుందన్న స్థానికుల ఫిర్యాదు మేరకు పరిశీలించి, వెంటనే పూడికతీత పనులు చేపట్టాలన్నారు. వార్డుల వారీగా బ్లాక్ స్పాట్స్ లేకుండా చర్యలు తీసుకోవడంలో భాగంగా గ్రీన్ మ్యాట్ లు, చెత్త వేయకూడదని బ్యానర్లను ఇంజినీరింగ్ అధికారుల సమన్వయంతో ఏర్పాటు చేసినప్పటికీ కొన్ని ప్రాంతాల్లో వ్యర్థాలు వేస్తున్నారన్నారు. ఆయా ప్రాంతాల్లో గమనించి వారికి అపరాధ రుసుం విధించాలన్నారు. డ్రెయిన్ల మీద ర్యాంపులు ఏర్పాటు చేసి శుభ్రం చేయడానికి వీలు లేకుండా ఉన్న ఆక్రమణలను తొలగించాలని పట్టణ ప్రణాళిక అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో ఏసీపీ రెహ్మాన్, డీఈఈ రమేష్ బాబు, సర్వేయర్ లక్ష్మీనారాయణ, ఇంజినీరింగ్, ప్రజారోగ్య, పట్టణ ప్రణాళిక అధికారులు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

ప్రజలు అసౌకర్యానికి గురికాకుండా చర్యలు తీసుకోవాలి

అన్న క్యాంటీన్లకు ఆహారం కోసం వచ్చే ప్రజలు అసౌకర్యానికి గురి కాకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశించారు. కమిషనర్ శుక్రవారం అమరావతి రోడ్డులోని అన్న క్యాంటీన్‌ని పరిశీలించి ఆహారం తీసుకుంటున్న వారితో మాట్లాడి ఆహార నాణ్యత, క్యాంటీన్లలో వసతులు అడిగి తెలుసుకొని సిబ్బందికి తగు ఆదేశాలు జారీ చేశారు.

బదిలీలు, పదోన్నతుల్లో ఎదురయ్యే సమస్యలను పరిష్కరించాలి

- పాఠశాల కమిషనర్‌కు ఎన్టీఏ విజ్ఞప్తి


కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎన్‌టీఏ నాయకులు

గుంటూరు (విద్య), మే 23 (ఆంధ్రజ్యోతి): బదిలీలు పదోన్నతుల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ నోబుల్ టీచర్ అసోసియేషన్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం పాఠశాల విద్యా కమిషనర్ కె.విజయ రామరాజుకు శుక్రవారం సచివా లయంలో రాష్ట్ర అధ్యక్షుడు కొండూరు శ్రీనివాసరాజు, ప్రధాన కార్యదర్శి బొనిగల హైమారావు తదితరుల బృందం వినతిపత్రం అందజేశారు. ఆన్‌లైన్ ద్వారా బదిలీలకు దరఖాస్తు చేయడంలో ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. ఏజెన్సీ ప్రాంత ఉపాధ్యాయులకు అదనపు పాయింట్లు చట్టం అమలు తేదీ నుంచి వర్తిస్తాయని, లాంగ్వేజ్ పండిట్ల సమస్యకు బదిలీలు పూర్తయిన వెంటనే ఒక శాశ్వత పరిష్కారం కనుగొంటామని, బదిలీల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటామని కమిషనర్ హామీ ఇచ్చారని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో నోబుల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి టి.సురేష్ కుమార్, చిత్తూరు జిల్లా అధ్యక్షుడు వి.జయ ప్రకాష్ నాయుడు పాల్గొన్నారు.

ఘనంగా ఎంజే మాణిక్యరావు శతజయంతి వేడుకలు

గుంటూరు (విద్య), మే 23 (ఆంధ్రజ్యోతి): అధ్యాపక, ఉపాధ్యాయ ఉద్యమ నేత దివంగత ఎంజే మాణిక్యరావు శత జయంతి శుక్రవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక ఏసీ కళాశాల సమీపంలోని ఎంజే మాణిక్యరావు విగ్రహం వద్ద ఉపాధ్యాయ, అధ్యాపక సంఘాల ఆధ్వర్యంలో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు, ఎంజే మాణిక్యరావు కుమారుడు ఎం.విజయ్ కుమార్, ఆక్టా అధ్యక్షుడు కె. మోహన్‌రావు, జనచైతన్య వేదిక నాయకులు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి, ఏసీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కొమ్మాలపాటి మోజస్, ఎయిడెడ్ విద్యాసంస్థల అధ్యాపకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


మాణిక్యరావు విగ్రహానికి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్సీ లక్ష్మణరావు ఉపాధ్యాయులు, అధ్యాపకులు

దాడి ఘటనపై కేసు నమోదు

గుంటూరు, మే 23 (ఆంధ్రజ్యోతి): లాలాపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని బాలాజీ నగర్ 6వ లైన్ కు చెందిన శిఖా మరియమ్మకు రవి, రత్నకుమారిలతో పరిచయం ఉంది. రవి తన కుమార్తెను మానసికంగా వేధిస్తూ వెంటపడుతున్నాడని, దీని గురించి అడగగా రవి, అతని భార్య రత్నకుమారి ఇంటికి వచ్చి కొట్టారని మరియమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పర్యావరణానికి హాని తలపెట్టనని రైల్వే అధికారుల ప్రతిజ్ఞ


రైల్వే అధికారులతో కలిసి ప్రతిజ్ఞ చేస్తున్న డీఆర్‌ఎం సుధేష్ణ సేన్

గుంటూరు, మే 23 (ఆంధ్రజ్యోతి): పర్యావరణానికి ఎలాంటి హాని తలపెట్టనని రైల్వే అధికారులతో గుంటూరు డీఆర్‌ఎం సుధేష్ణ సేన్ ప్రతిజ్ఞ చేయించారు. రైల్ వికాస్‌భవన్‌లో శుక్రవారం ప్రపంచ పర్యావరణ దినం పక్షోత్సవాల్లో భాగంగా ర్యాలీలు, నాటకాలు జరిగాయి. డీఆర్‌ఎం మాట్లాడుతూ పర్యావరణానికి మేలు చేసే అలవాట్లనే అందరూ అలవర్చుకొని పాటించాలన్నారు. ప్లాస్టిక్‌తో తయారైన నీటిబాటిల్స్, కప్పులు, ట్రేలు ఎట్టి పరిస్థితుల్లో వినియోగించరాదన్నారు. వాటికి బదులుగా స్టీలు, గాజు పదార్థాలతో తయారు చేసిన వాటిని ఉపయోగించాలని సూచించారు. జూన్ 6వ తేదీ వరకు ఈ కార్యక్రమాలను డివిజన్ వ్యాప్తంగా కొనసాగిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఏడీఆర్‌ఎం కే.సైమన్, సీనియర్ డీఈఎన్ కో ఆర్డినేషన్ జేవీ అనూష, సీనియర్ డీఎంఈ ఎం.రవికిరణ్, డీసీఎం కోఆర్డినేషన్ డాక్టర్ సీహెచ్ ప్రదీప్‌కుమార్, సీనియర్ డీవోఎం శ్రీనాథ్, సీనియర్ డీపీవో షాబాజ్ హనూర్, డీసీఎం కే.కమలాకర్‌బాబు, డీఎస్‌సీ మధుసూదనరావు తదితరులు పాల్గొన్నారు.

ధనేకుల వెంకటేశ్వరరావు కవితలు చిరస్మరణీయం

గుంటూరు(తూర్పు), మే 23 (ఆంధ్రజ్యోతి): చిరు కవితలతో సామాజిక చైతన్యాన్ని పెంపొందించిన ధనేకుల వెంకటేశ్వరరావు సాహితి సేవలు చిరస్మరణీయమని మాజీ మంత్రి డొక్కా మాణిక్యవరప్రసాదు అన్నారు. స్థానిక బృందావన్ గార్డెన్స్, శ్రీ వేంకటేశ్వరస్వామి దేవస్థానం, అన్నమయ్య కళావేదిక శుక్రవారం డాక్టర్ నరాలశెట్టి రవికుమార్ నిర్వహణలో కవి ధనేకుల వారి సంస్మరణ రచయితల సభ జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ నేటి కవుల తరంలో ధనేకులది ప్రత్యేక శైలి అని, ఆయన మరణం సాహితీ లోకానికి తీరని లోటని అన్నారు. కేంద్ర సాహిత్య అకాడమి అవార్డు గ్రహీత పాపినేని శివశంకర్ మాట్లాడుతూ కవి ధనేకులతో రచయితలు వారి స్వానుభవాలను స్మరించుకుంటూ ఆయన రచనా పాటవాన్ని ప్రశంసించారు. కొణతం నాగేశ్వరరావు, బాబురావు, పలనాటి సుబ్బారావులు కవి ధనేకుల వారి కవితా పఠనం చేశారు. సభకు అధ్యక్షులుగా ఆలోకం పెద్దబ్బాయి వ్యవహరించగా, కారుమంచి లీలాశంకర్ పర్యవేక్షణలో పీఎస్ మూర్తి కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో బొల్లేపల్లి సత్యనారాయణ, లంక సూర్యనారాయణ, తుర్లపాటి రాధాకృష్ణమూర్తి, నాయుడుగోపి, సుఖవాసి మల్లికార్జునరాయ శాస్త్రి, నూతలపాటి తిరుపతయ్య, పెద్ది సాంబశివరావు, డాక్టర్ రావెల సాంబశివరావు, డాక్టర్ బీరం సుందరరావు, జక్కంపూడి సీతారామారావు, డాక్టర్ రావి రంగారావు, డాక్టర్ దేవరపల్లి ప్రభుదాస్ తదితరులు పాల్గొని ధనేకుల సాహిత్యాన్ని కొనియాడారు.


మాట్లాడుతున్న డొక్కా మాణిక్యవరప్రసాదు పాల్గొన్న సాహితి వేత్తలు

కళారూపాలతోనే ప్రజా చైతన్యం

- సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల


మాట్లాడుతున్న జంగాల అజయ్‌కుమార్, పాల్గొన్న ఇప్టా నాయకులు

గుంటూరు (తూర్పు), మే 23 (ఆంధ్రజ్యోతి): సమాజంలో నెలకొన్న సమస్యలపై ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చేందుకు కళారూపాలు అవసరమని సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్ అన్నారు. స్థానిక కొత్తపేటలోని మల్లయ్య లింగం భవన్‌లో ఏపీ ప్రజానాట్యమండలి రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో జరుగుతున్న రాష్ట్రస్థాయి కళారూపాల శిక్షణ శిబిరాన్ని శనివారం ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ కళారూపాలు, అభ్యుదయ గేయాలు, ప్రజా చైతన్యం కోసం, అసాంఘిక, మతోన్మాద, మూఢ నమ్మకాలకు వ్యతిరేకంగా ప్రజలను చైతన్యపరిచేందుకు కృషిచేసిన ప్రజా నాట్యమండలి సేవలు అభినందనీయమన్నారు. ఇప్టా జాతీయ కార్యదర్శి గని మాట్లాడుతూ కళారూపాల ద్వారా నాయకుల మోసాన్ని నిలదీయాలన్నారు. ఆపరేషన్ కాగార్ పేరుతో మావోయిస్టులను చంపడం దారుణం అన్నారు. ఇటువంటి ఘటనలను పాటలు రూపంలో ప్రజలకు తెలియజేయాలని అన్నారు. ఈ నెల 26వ తేది వరకు ఈ కార్యక్రమం జరుగుతుందని చెప్పారు. సభకు ప్రజా నాట్యమండలి రాష్ట్ర అధ్యక్షుడు చంద్రనాయక్ అధ్యక్షత వహించగా, కార్యక్రమంలో పెంచలయ్య, రామకృష్ణ, ఆరేటి రామారావు, పిచ్చయ్య, బొల్లిమంత కృష్ణ, నసీర్, నాగరాజు, శివయ్య పాల్గొన్నారు.

ఎండీయూ వాహనాల రద్దు విరమించుకోవాలి

- స్తంభాలగరువులో పలువురు ఆపరేటర్ల నిరసన


నిరసన తెలియజేస్తున్న ఎండీయూ వాహన ఆపరేటర్లు

గుంటూరు, మే 23 (ఆంధ్రజ్యోతి): ఇంటింటికి రేషన్ పంపిణీ చేసే రేషన్ డోర్ డెలివరీ(ఎండీయూ) వాహనాల రద్దు నిర్ణయాన్ని విరమించుకోవాలని పలువురు ఎండీయూ వాహన ఆపరేటర్లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం స్తంభాలగరువు సెంటర్‌లో ఆయా వాహనాలతో నిరసన తెలిపారు. వైసీపీ సానుభూతిపరుడైన ఆపరేటర్ షేక్ మహబూబ్ బాషా ఆధ్వర్యంలో పలువురు ఆపరేటర్లు వైయస్సార్ విగ్రహం వద్ద అర్ధనగ్నంగా నిరసన వ్యక్తం చేశారు. ఒక వాహనంపై రెండు కుటుంబాలు ఆధారపడి జీవనం సాగిస్తున్నాయన్నారు. ఎన్నికల హామీల్లో భాగంగా ఎండీయూ వాహనాలను కొనసాగించాలని వారు డిమాండ్ చేశారు. కలెక్టరేట్ వరకు ర్యాలీగా వెళ్తామని చెప్పగా అనుమతి లేకపోవడంతో సీఐ గంగా వెంకటేశ్వర్లు నిరాకరించారు. దీంతో వారు అక్కడి నుంచి వెనక్కి వెళ్లిపోయారు.


కార్యకర్త సంక్షేమ నిధిని అందజేస్తున్న ఎమ్మెల్యే నసీర్

టీడీపీకి కార్యకర్తలే ఊపిరి

- తూర్పు ఎమ్మెల్యే మహ్మద్ నసీర్
- కార్యకర్త కుటుంబానికి రూ.5 లక్షల చెక్కు అందజేత

గుంటూరు, మే 23 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీకి కార్యకర్తలే ఊపిరి అని, అలాంటి కార్యకర్తల ఊపిరి ఆగినప్పుడు వారి కుటుంబానికి అండగా నిలవడం తమ బాధ్యత అని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మహ్మద్ నసీర్ అన్నారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించిన గుంటూరు వల్లూరివారి తోటకు చెందిన వింజమూరి నాగమణి కుటుంబానికి శుక్రవారం ఆయన కారకర్తల సంక్షేమ నిధి చెక్కును అందజేశారు. కార్యకర్తల సంక్షేమ నిధి నుంచి రూ.5 లక్షల ప్రమాద బీమా చెక్కు మంజూరుకాగా దాన్ని ఆయన బాధిత కుటుంబానికి అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు త్యాగస్వభావం కలవారని, పట్టుదల, నిజాయితీ వారి సొంతమని కొనియాడారు. పార్టీ విజయం వెనుకున్న శక్తి వారేనని అన్నారు. అలాంటి కార్యకర్తలను ప్రోత్సహించడమే కాదు, వారి అవసరాలను గుర్తించి సహాయపడటానికి అందరం ముందుకు వస్తున్నామని చెప్పారు. సీఎం చంద్రబాబు, యువనేత, మంత్రి లోకేశ్ సంకల్పంతో తెలుగుదేశం పార్టీ కార్యకర్తలకు భరోసా కల్పిస్తున్నామని చెప్పారు.

అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే

నగరంలోని బుచ్చయ్యతోటలో జరిగిన ప్రసన్నాంజనేయ స్వామి జయంతి కార్యక్రమంలో ఎమ్మెల్యే నసీర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం జరిగి అన్నదానంలో ఆయన పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో బత్తిన శంకర్, పులిగడ్డ నాగేశ్వరరావు, వాణి, ఎర్రగోపు నాగేశ్వరరావు, గణేశ్, శ్రీను, ఆదిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.


ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే గళ్ళా మాధవి

వర్షాకాలం దృష్ట్యా కాలువలను శుభ్రపరచాలి

- పశ్చిమ ఎమ్మెల్యే గళ్ళా మాధవి

గుంటూరు, మే 23 (ఆంధ్రజ్యోతి): వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో ఉన్న కాలువలను మున్సిపల్ సిబ్బంది వెంటనే శుభ్రపరచాలని ఎమ్మెల్యే గళ్ళా మాధవి ఆదేశించారు. గతంలో వర్షాకాలంలో నీళ్ల ఇళ్ల లోకి చేరటం వలన ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారని, మురుగునీరు నిలబడకుండా, సిల్టేషన్ తొలగింపు పనులు ప్రారంభించాలన్నారు. పశ్చిమ నియోజకవర్గ కార్యాలయంలో శుక్రవారం ఆమె ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి వినతులు స్వీకరించి, వాటిని పరిష్కరించవలసినదిగా సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాధవి మాట్లాడుతూ... నియోజకవర్గంలో నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ, వారి సమస్యల్ని పరిష్కరించటమే తన ధ్యేయమని, ప్రజాప్రతి నిధులు, అధికారుల సమన్వ యంతోనే ప్రజా సమస్యలు పరిష్కారం అవుతాయని ఆమె చెప్పారు. రాష్ట్రంలో కొన్ని కరోనా కేసులు నమోదైన నేపథ్యంలో ప్రజలు వ్యక్తిగత దూరం పాటిస్తూ, అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని ప్రజలకు సూచించారు. తన హయాంలో జగన్ రెడ్డి అండ్ కో ఇష్టానుసారం దోచుకుతిని, నేడు ప్రజల ముందు కళ్లార్పకుండా అబద్ధాలు చెప్పే ఘనుడు జగన్‌మోహన్‌రెడ్డి అని, ఆయనను ఎవరూ విశ్వసించరని ఎమ్మెల్యే మాధవి విమర్శించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకులు సింహాద్రి కనకాచారి పాల్గొన్నారు.

అన్ని దానాలలో అన్నదానం గొప్పది

- వేద సీడ్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ తులసి ధర్మచరణ్

గుంటూరు, మే 23(ఆంధ్రజ్యోతి): అన్ని దానాల్లో కెల్లా అన్నదానం ఎంతో పుణ్యకార్యమని వేద సీడ్స్ ఎగ్జిక్యూటివ్ డైరక్టర్ (ఈడీ) తులసీ ధర్మచరణ్ అన్నారు. స్థానిక కొత్తపేట శ్రీఅభయ వీరాంజనేయ స్వామి వారి దేవస్థానంలో హనుమాన్ జయంతి మహోత్సవంలో భాగంగా పోతురాజు రామకృష్ణ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని వేద సీడ్స్ ఈడీ తులసి ధర్మచరణ్ శుక్రవారం ప్రారంభించారు. ధర్మచరణ్ ఆలయ కమిటీ సభ్యులతో కలిసి స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి వేద పండితుల నుంచి ఆశీర్వాదం స్వీకరించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ధర్మచరణ్ మాట్లాడుతూ ఇప్పటి కాలంలో ప్రజలు వారి పనులతో ఎంతో ఒత్తిడికి లోనవుతున్నారని, దైవ కార్యక్రమాల్లో పాల్గొనడం వలన ఎంతో ఉపశమనం లభిస్తుందన్నారు. మనకు అందుబాటులో ఉన్న దేవాలయాల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ తమకు తోచిన విధంగా చేయూతనివ్వాలన్నారు. అన్నిదానాల్లో కల్లా అన్నదానం మహా పుణ్యం అన్నారు. ఈ కార్యక్రమంలో పోతురాజు శ్రీనివాసరావు, పోతురాజు చంద్రశేఖర్, డాక్టర్ శనక్కాయల ఉమాశంకర్, తోట రంగారావు, గాజుల సాయిరాం, జి బాలసుబ్రమణ్యం, తేలప్రోలు వెంకట్రావు, అవ్వారి మురళి, ఆర్ఎస్ఎస్ కమిటీ సభ్యులున్నారు.


అన్న సంతర్పణ ప్రారంభిస్తున్న ఈడీ తులసీ ధర్మచరణ్ తదితరులు

వాయుపుత్రునికి లక్షమల్లెల అర్చన


స్వామి వారికి లక్ష మల్లెల అర్చన చేస్తున్న అర్చకులు

గుంటూరు(తూర్పు), మే 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక మారుతినగర్, శ్రీ మారుతి దేవాలయ ప్రాంగణంలో హనుమత్ జయంతి మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం, స్వామివారికి మహన్యాస పూర్వక ఏకాదశి రుద్రాభిషేకాలు నిర్వహించారు. అనంతరం మూల విరాట్‌కు అర్చకులు లక్ష మల్లెల అర్చన కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. శనివారం స్వామి వారి ఊరేగింపు, నందీశ్వర అభిషేకం జరుగుతాయని పాలకమండలి సభ్యుడు కొర్రపాటి రామారావు తెలిపారు. కార్యక్రమాలను కార్యదర్శి తంగిరాల శ్రీనివాస్ పర్యవేక్షిస్తున్నారు.



నాటి నాణ్యతకు నిదర్శనం

పైకప్పు పునరుద్ధరిస్తున్న ఈ భవనం నరసరావుపేట ఆర్డీఓ కార్యాలయం. 131 ఏళ్ల క్రితం నిర్మించింది. బ్రిటిష్ వలస పాలనకు ఒక ఆనవాలు. రాతితో నిర్మించిన గోడలు ఇప్పటికీ దృఢంగా ఉన్నాయి. మట్టి పెంకులతో వేసిన పై కప్పు మాత్రమే శిథిలావస్థకు చేరింది. పెంకుల కింద టేకు కలప చెక్క చెదరలేదు. వర్షం వస్తే ఉరవడంతో.. కార్యాలయ నిర్వహణ కష్టంగా మారింది. దీంతో కలెక్టర్ అరుణ్‌బాబు మరమ్మతులకు రూ.24 లక్షలు నిధులు విడుదల చేశారు. ఆర్అండ్‌బీ పనులు చేపట్టింది. కప్పుకు ఉన్న కలపపైనే పెంకులు తొలగించి.. సిమెంట్ షీట్లు ఏర్పాటు చేస్తున్నారు. గోడలను కదలించకుండా పనులు చేస్తున్నారు. 1894లో ఈ భవనాన్ని ప్రారంభించినట్లు శిలాఫలకం తెలియజేస్తోంది. ఎంతో నాణ్యతతో నాడు నిర్మిం చడం వల్లే 13 దశాబ్దాల పాటు ఈ భవనం సేవలందించింది. పునరుద్ధరణ పనుల తో మరో 50 ఏళ్లైనా ఈ భవనంలో ఆర్డీవో కార్యాలయ సేవలు అందిం చేంతగా గోడలు పటిష్టంగా ఉన్నాయి. ప్రస్తుతం కొత్తగా నిర్మిస్తు న్న ప్రభుత్వ భవనాలు పదేళ్లకే పగుళ్లిచ్చి.. శ్లాబ్‌ల నుంచి నీరు కారుతుండటం చూస్తున్నాం.

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)



ప్లాస్టింగ్ ఊడిపోయి... రంగులు వెలసిన కార్యాలయం

పెచ్చులూడిపోతున్న గోడలు

వ్యయ సాయం కావాలేమో..!

దుస్థితిలో వ్యవసాయ శాఖ రాష్ట్ర కార్యాలయం

అది రాష్ట్రస్థాయి వ్యవసాయ శాఖ కార్యాలయం. రైతుల సంక్షేమం కోసం నిత్యం పాటుపడే అధికారులు సిబ్బంది అక్కడ పని చేస్తారు. అంతేకాదు ఎంతో మంది రైతులు తమ సమస్యలు చెప్పుకునేందుకు అక్కడికి వస్తారు. ఇటువంటి కార్యాలయం అధ్వాన స్థితిలో దర్శనమిస్తోంది. ఎప్పుడు పడిపోతుందో తెలియని సీలింగ్. చిన్నపాటి వర్షానికి లీకేజీలు. పెచ్చులూడిపోతున్న గోడలు. రంగులు వెలసి కళావిహీనంగా మారిన కార్యాలయం ఆవరణ. ఇది చుట్టుగుంట సెంటర్‌లోని రాష్ట్రస్థాయి వ్యవసాయ శాఖ కార్యాలయం దుస్థితి. రైతు సంక్షేమం కోసం రూ.వేల కోట్లు బడ్జెట్ కేటాయించే శాఖలో కార్యాలయ దుస్థితి దయనీయంగా మారింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి కార్యాలయానికి మరమ్మతులు చేయాలని విజ్ఞప్తులు వెలువెత్తుతున్నాయి.

- గుంటూరు (ఆంధ్ర జ్యోతి)



కురుస్తున్న నీటిని పట్టేందుకు బకెట్ ఏర్పాటు

ఉద్యోగాలంటూ.. వసూళ్లు

(5వ పేజీ తరువాయి)

గుట్టురట్టు చేశారు. వారి నుంచి నకిలీ సర్టిఫికెట్లు, అపాయింట్‌మెంట్ లెటర్లు, స్టాంపులు, నకిలీ ఐడీ కార్డులు పట్టుకోగలిగారు. అయితే ఈ వ్యవహారంలో ఎవరి పాత్ర ఎంతవరకు ఉందనేది తేలాల్సిఉంది.

వెలుగుచూసిన మోసాలు..

● అంగలకుదురుకు చెందిన ఓ యువకుడికి నాగార్జున విశ్వవిద్యాలయం ముద్రలున్న లెటర్ పేపర్‌పై కంప్యూటర్ డివిజన్‌లో జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగమని అపాయింట్‌మెంట్ లెటర్‌ను కూడా పంపారు. నిజంగా యూనివర్సిటీలో ఉద్యోగం అయితే నమ్మేవారే. కానీ గుంటూరులోని హిందూ కళాశాలలో ఉద్యోగం కల్పిస్తున్నట్లు చూపడంతో అనుమానం కలిగింది. అదేమని నిలదీస్తే యూనివర్సిటీ పరిధిలోని అన్ని కళాశాలల్లో ఉద్యోగాలు యూనివర్సిటీనే ఇస్తుందని బుకాయించి నమ్మకం లేకుంటే డబ్బు ఇచ్చేస్తామని జారుకున్నారని బాధితుడు వాపోయారు. తర్వాత గుంటూరు వెళ్లి డబ్బు ఇవ్వమని అడిగితే రూపాయి కూడా ఇవ్వమని, గట్టిగా అడిగితే పోలీసులు, లాయర్లు ఉన్నారు.. కేసులుపెట్టి లోపల వేయిస్తామంటూ బెదిరించారని వాపోయాడు.

● తెనాలి చెంచుపేటకు చెందిన ఓ వ్యాపారి తన ఇద్దరు పిల్లలకు సెక్రటేరియేట్‌లో ఉద్యోగం వచ్చిందని, రెండు రోజుల్లో అపాయింట్‌మెంట్ లెటర్ వస్తుందని, వెంటనే ఉద్యోగంలో చేరిపోవడమేనంటూ ఈ ముఠాలోని వారు నమ్మించారు. ఐడీ కార్డులు, అపాయింట్‌మెంట్ లెటర్ కూడా చూపారు. అయితే ఔట్‌సోర్సింగ్ కాకుండా ఏకంగా ప్రభుత్వ ఉద్యోగమేనంటూ చెప్పుకు రావడంతో అనుమానం వచ్చిన వ్యాపారి గుంటూరు రేంజ్ ఐజీని కలవగా ఫిర్యాదు చేయాలని వ్యాపారికి సూచించారు.

● ఉద్యోగం కోసం డబ్బు చెల్లించిన అంగలకుదురుకు చెందిన ఓ యువకుడు ఇటీవలే రోడ్డు ప్రమాదంలో మరణించడంతో అతడి బంధువులు వెళ్లి తామిచ్చిన డబ్బు తిరిగి ఇవ్వాలని ప్రాధేయపడ్డారు. అయితే ముఠాలోని వారు కనికరం చూపకుండా మీ అబ్బాయికి ఉద్యోగం వచ్చిందని, చేరకపోతే దానికి తాము బాధ్యులమెలా అవుతామని, అధికారులకు లంచాలివ్వడానికే డబ్బు సరిపోయిందని, ఒక్క పైసా కూడా ఇవ్వమంటూ గెంటేశారని బంధువులు వాపోయారు.

మునిసిపల్ విలీన గ్రామాల.. సమస్యలకు త్వరలో పరిష్కారం

● రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ కమిషనర్ ఎం.కృష్ణతేజ

● గణపవరం రక్షిత మంచి నీటి పథకం ఫిల్టర్ బావుల పరిశీలన

● మరమ్మతులకు నిధులు మంజూరు చేయాలని అధికారులకు ఆదేశం



అధికారులను సమస్యలు అడిగి తెలుసుకుంటున్న కమిషనర్ కృష్ణతేజ, ఎమ్మెల్యే పుల్లారావు

నాదెండ్ల, మే 23 (ఆంధ్రజ్యోతి): మునిసిపల్ విలీన గ్రామాల సమస్యలను ప్రభుత్వం త్వరలోనే పరిష్కరిస్తుందని రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ కమిషనర్ మైలవరపు కృష్ణతేజ తెలిపారు. ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు వినతి మేరకు ఆయన శుక్రవారం గణపవరం గ్రామాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా నాచుతో అధ్వానంగా ఉన్న ఫిల్టర్ బావులను పుల్లారావుతో కలసి పరిశీలించారు. ఫిల్టర్ బెడ్ల మరమ్మతులకు జిల్లా, మండల పరిషత్‌ల నుంచి రూ.32 లక్షలు మంజూరు చేయాలని జడ్పీ సీఈవో జ్యోతిబస్, ఎంపీడీవో స్వరూపరాణిలను ఆదేశించారు. అనంతరం చిలకలూరిపేటలో విలీనమైన గణపవరం, పసుమర్రు, మానుకొండవారిపాలెం గ్రామస్తులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. గణపవరం గ్రామాన్ని వైసీపీ ప్రభుత్వంలో మునిసిపాలిటీలో విలీనం చేయడంతో పాటు కోర్టు స్టే ఇచ్చిందని, దీంతో తాము తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని గ్రామస్తులు వివరించారు. గడిచిన ఐదేళ్లలో 15వ ఆర్థిక సంఘం నిధులతో పాటు ఉపాధి హామీ పథకం తదితర నిధులు రూ.15 కోట్లు పంచాయతీకి రాకపోవడం వల్ల అభివృద్ధి కుంటుపడిందని వివరించారు. దీంతో స్పందించిన కమిషనర్ ఆయా గ్రామాల ప్రజలు చేసిన తీర్మానాలకు సంబంధించిన ప్రక్రియ కొనసాగుతోందని, రెండు నెలల్లోనే సమస్య పరిష్కార మవుతుందని సమాధానం ఇచ్చారు. పన్నుల వసూలుతో పాటు ప్రభుత్వ పథకాల మంజూరులో ఎదుర్కొంటున్న ఇబ్బందులను వివరించి, సాంకేతిక సమస్యలు పరిష్కరించాలని కోరారు. మూడు గ్రామాలకు పెండింగ్‌లో ఉన్న ఉపాధి హామీ నిధులు మంజూరు చేస్తామని కమిషన్ చెప్పారు. చిరుమామిళ్ల గ్రామానికి చెందిన సింగారెడ్డి కోటిరెడ్డి అనే వ్యక్తి వైసీపీ ప్రభుత్వ హయాంలో నీటి వ్యాపారం చేసి విద్యుత్ బిల్లులు బకాయి పెట్టిన విషయంపై గ్రామానికి చెందిన హరికృష్ణ ఫిర్యాదుకు.. శాఖ పరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా పంచాయతీ అధికారిని కృష్ణతేజ ఆదేశించారు.

గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక చొరవ చూపండి : ఎమ్మెల్యే ప్రత్తిపాటి

మునిసిపాలిటీలో విలీనం అయిన మూడు గ్రామాల సమస్య పరిష్కారంపై స్పష్టత ఇచ్చిన కమిషనర్ కృష్ణతేజకు ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు కృతజ్ఞతలు తెలిపారు. నియోజకవర్గంలోని గ్రామాల అభివృద్ధికి తగిన సహాయ సహకారాలు అందించాలని కోరారు. దీంతో తాను ఈ ప్రాంతానికి చెందిన వాడినేనని, ఇక్కడి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ఎవరైనా తన దృష్టికి తేవచ్చని కమిషనర్ తెలిపారు. డీపీవో నాగేశ్వర నాయక్, ఎస్పీ అనంతరాజు, మునిసిపల్ ఫ్లోర్ లీడర్ గంగా శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ వలేటి హిమవంతరావు, కౌన్సిలర్ జాలాది సుబ్బారావు, డీఈ హరినాథబాబు, కెల్లంపల్లి అచ్చయ్య, నాయకులు ఎస్.సదాశివరావు, జె.మదన్, పలు శాఖల ఏఈలు తదితరులు ఉన్నారు.



అధ్వానంగా ఉన్న ఫిల్టర్ బావి

మోడల్ స్కూల్



మోడల్ స్కూల్..

● వేధిస్తున్న బోధన సిబ్బంది కొరత

● ప్రారంభంకాని విద్యార్థినుల వసతి గృహం

● రవాణా సౌకర్యం లేక విద్యార్థులకు ఇక్కట్లు

● రాళ్లతో నిండిన మైదానం..



ప్రారంభంకాని విద్యార్థినుల వసతి గృహం

వెల్దుర్తి, మే 23 (ఆంధ్రజ్యోతి): పేరుకేమో మోడల్ స్కూల్. ఆ స్థాయికి తగ్గ వసతులు మాత్రం నిల్. సరిపడా లేని ఉపాధ్యాయులు. ఊసేలేని క్రీడా ప్రాంగణం. కనిపించని ప్రహరీ. ప్రారంభానికి నోచుకోని బాలికల వసతిగృహం. కొండరాళ్ల మధ్యనే బడికి బాట. ఇలా చెప్పుకుంటూ పోతే సమస్యలు కోకొల్లలు. ఇదీ వెల్దుర్తి మండలం కండ్లకుంట మోడల్ స్కూల్ సమస్యల చిట్టా. మాచర్ల నియోజకవర్గంలో నాలుగు మోడల్ స్కూల్స్ ఏర్పాటు చేయగా ఇందులో కండ్లకుంట పాఠశాల ఒకటి. 4.2 ఎకరాల విస్తీర్ణంలో సుమారు రూ.3 కోట్ల వ్యయంతో ఈ భవనాలను నిర్మించారు. 2011లో శంకుస్థాపన జరుపుకున్న ఈ ఆదర్శ పాఠశాలలో 2013 నాటికి తరగతులు ప్రారంభించారు.

పన్నెండేళ్లయినా..బోధన సిబ్బంది కొరత

ఆదర్శ పాఠశాల ప్రారంభించి పన్నెండేళ్లు గడుస్తున్నా సరిపడ బోధనా సిబ్బంది నియామకం జరగలేదు. మొత్తం 20 మంది ఉండాల్సి ఉండగా 10 మంది మాత్రమే శాశ్వత ఉపాధ్యాయులు ఉన్నారు. ఏడుగురు కాంట్రాక్ట్ ఉపాధ్యాయులతో నెట్టుకొస్తున్నారు. పాఠశాల ఆవరణ అంతా కొండరాళ్లు కావడంతో.. క్రీడా ప్రాంగణం ఊసే లేకుండా పోయింది. వర్షాలు పడితే నీరు నిలిచి చిత్తడిగా మారుతోంది.

వసతి లేక అవస్థలు

పాఠశాలకు అనుబంధంగా బాలికల వసతి గృహ నిర్మాణానికి

వసతులు నిల్

2020లో రూ. 225.10 లక్షలతో శంకుస్థాపన చేశారు. కొద్దిపాటి వసతులు సమకూరకపోవడంతో ఈ భవనం ప్రారంభానికి నోచుకోలేదు. మండలంలోని వివిధ గ్రామాల నుంచి పాఠశాలకు విద్యార్థులు ఆటోలు, బస్సుల ద్వారా చేరుకోవాలి. శిరిగిరిపాడు, వెల్దుర్తి, ఉప్పలపాడు విద్యార్థులు మండాది వరకు వచ్చి అక్కడి నుంచి కండ్లకుంటకు చేరుకోవాలి. ఆర్టీసీ అధికారులు విద్యార్థులకు ఒక రూటుకు మాత్రమే ఉచిత పాసు ఇస్తున్నారు. మరో రూటుకు టికెట్ తీసుకోవాల్సిందే. దీంతో దాదాపుగా ఆయా గ్రామాల విద్యార్థులు పాఠశాలకు స్వస్తి పలికారు. ప్రధానంగా మరసపెంట, గంగలకుంట విద్యార్థులు ప్రయాణ సౌకర్యం లేక తీవ్ర ఇబ్బందులకు పడుతున్నారు. సొంత ఖర్చులతో ప్రైవేటు వాహనాల్లో పాఠశాలకు చేరుకుంటున్నారు. ఉదయం, సాయంత్రం పాఠశాల సమయంలో మరసపెంటకు వెళ్లే బస్సు కండ్లకుంటకు వచ్చి వెళ్తే విద్యార్థులకు అనుకూలంగా ఉంటుంది.

ఎమ్మెల్యే జూలకంటి స్పందించారు



పాఠశాలలో సమస్యలపై ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి దృష్టికి తీసుకెళ్లగా సానుకూలంగా స్పందించారు. సమస్యలను పరిష్కరిస్తానని హామీనిచ్చారు. విద్యార్థినులకు హాస్టల్ ప్రారంభిస్తే ప్రయాణ కష్టలు తీరుతాయి. మరసపెంట, గంగలకుంట విద్యార్థులకు ప్రయాణం ఇబ్బందిగా ఉన్నందున ఆర్టీసీ అధికారులు ప్రత్యేక ఏర్పాటు చేస్తే బాగుంటుంది.

- సుమంత్, ప్రిన్సిపల్, ఆదర్శ పాఠశాల



పల్నాడు జిల్లాలో అంగన్వాడీ కేంద్రాలు
2,031

జిల్లాలోని అంగన్‌వాడీల చిన్నారుల వివరాలు

0-6 నెలలు	ఏడాదిలోపు	ఏడాది నుంచి మూడేళ్లలోపు	మూడు నుంచి ఆరేళ్ల లోపు
11,148	11,955	49,078	42,289

బాలలకు..మరింత బలం

● జూన్ నుంచి అంగన్‌వాడీల్లో మెనూ మార్పు

● చక్కెర లేకుండా బాలామృతం సరఫరా

● పోషకాహారం మరింత బలవర్ధకం

సత్తెనపల్లి, మే 23 (ఆంధ్రజ్యోతి): బాల్య బక్క చిక్కుతోంది. పోషకాహారం లేమితో పలువురు చిన్నారులు అనారోగ్యం బారిన పడుతున్నారు. ఈ నేపథ్యంలో చిన్నారుల ఆరోగ్యంపై కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ఆరోగ్యకరమైన, బలవర్థక ఆహారం అందించేలా చర్యలు చేపట్టింది. జూలై నెల నుంచి నూతన విధానం అమల్లోకి తేనుంది.

మూడు నుంచి ఆరేళ్ల చిన్నారులకు..

ప్రస్తుతం మూడు నుంచి ఆరు సంవత్సరాల చిన్నారులకు అల్పాహారంగా ఉడికించిన కోడి గుడ్డు, వంద ఎంఎల్ పాలు, మధ్యాహ్నం పప్పుతో కూడిన భోజనం అందిస్తున్నారు. మూడు సంవత్సరాల లోపు చిన్నారులకు బాలామృతం ప్యాకెట్లు ఇచ్చారు. ఇక నుంచి అంగన్ వాడీ కేంద్రాల్లో ఆరు నుంచి మూడు సంవత్సరాల పిల్లలను ఒకే సమూహంగా పరిగణిస్తున్నారు.

ఇక నుంచి ఇలా..

ఇక నుంచి అంగన్వాడీ చిన్నారులను.. ఆరు నుంచి 12 నెలలు, 12 నెలల నుంచి మూడు సంవత్సరాల చిన్నారులుగా విభజిస్తారు. మూడు నుంచి ఆరు సంవత్సరాల పిల్లలకు అంగన్‌వాడీ కేంద్రాల్లో వారంలో రెండు సార్లు యగ్ ఫ్రైడ్ రైస్ అందించనున్నారు. ఉదయం ఉడికించిన శనగలు ఇవ్వనున్నారు. మూడేళ్ల లోపు చిన్నారులకు అందించే బాలామృతంలో తీపి శాతాన్ని తొలగించనున్నారు. ఈ మార్పును అమలుకు ప్రతి జిల్లాకు ఒక కేంద్రాన్ని పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేశారు. పల్నాడు జిల్లాలో నరసరావుపేట ప్రాజెక్టు పరిధిలోని ఒక కేంద్రాన్ని ఎంపిక చేశారు.

చక్కెర లేకుండా..

ప్రస్తుతం ఉన్న బాలామృతంలో కూడా వంద గ్రాముల పోషకాహారాలు ఉన్నాయి. కొత్తగా ఇవ్వనున్న బాలామృతంలో చక్కెర శాతాన్ని తీసి వేయనున్నారు. మూడు సంవత్సరాల నుంచి ఆరు సంవత్రాల లోపు పిల్లలకు సోమవారం ఉడికించిన కోడి గుడ్డు, దోసకాయ పప్పు, వంద మిల్లీ లీటర్లు పాలు, మంగళవారం ఉడకబెట్టిన శనగలు, యగ్ ఫ్రైడ్ రైస్, వంద గ్రాముల పాలు, బుధవారం ఉడికించిన కోడి గుడ్డు, ఆకు కూర పప్పుతో వైట్ రైస్, వంద గ్రాముల పాలు ఇవ్వనున్నారు. గురువారం ఉడికించిన కోడి గుడ్డు, విజిటేబుల్ కూర, వైట్ రైస్, వంద గ్రాముల పాలు, శుక్రవారం ఉడికించిన గుడ్డు, వైట్ రైస్, సొరకాయ పప్పు, వంద మిల్లీ లీటర్లు పాలు, శనివారం ఉడకపెట్టిన శనగలు, యగ్ ఫ్రైడ్ రైస్, వంద మిల్లీ లీటర్లు పాలు ఇవ్వనున్నారు. బాల సంజీవని +లో భాగంగా గిరిజన ప్రాంతాల్లో మూడు నుంచి ఆరు సంవత్సరాల లోపు పిల్లలకు రోజుకు రెండు వందల మిల్లీ లీటర్ల పాలు అందించనున్నారు.

జూన్ నుంచి కొత్త మెనూ అమలు

గతంలో అందించిన బాలమృతంలో 25 రోజులకు గోధుమలు 1,375 గ్రాములు పిల్లలకు ఇచ్చేశారు. శనగలు 125 గ్రాములు, వేయించిన వేరు శనగలు 250 గ్రాములు, నూనె 250 గ్రాములు, చెక్కెర 500 గ్రాములు కలిపి పోషాకాహారం కింద ఇచ్చేవారు.

● ఇక జూన్ నెల నుండి 6 నెలలు- 12 నెలల చిన్నారులకు 25 రోజులకు వేయించిన గోధుములు 1,500 గ్రాములు, శనగలు 250 గ్రాములు, వేయించిన వేరు శనగలు 500 గ్రాములు, నూనె 250 గ్రాములు అందించనున్నారు.

● 12 నెలల నుంచి మూడు సంవత్సరాల లోపు చిన్నారులకు 25 రోజులకు 1,750 గ్రాములు వేయించిన గోధుములు, శనగలు 500 గ్రాములు, వేయించిన వేరు శనగ చిక్కీలు పది, నూనె 250 గ్రాములు ఇవ్వనున్నారు.

● కొత్తగా ఆరు నుంచి 12 నెలల పిల్లలకు జూనియర్ బాలామృతం ఇవ్వనున్నారు. దీనిలో వంద గ్రాముల పోషకాహారం ఉంటుంది. 12 నుంచి 36 నెలల పిల్లలకు సీనియర్ బాలామృతం ఇవ్వనున్నారు. దీనిలో మొత్తం వంద గ్రాముల పోషకాహారం ఉంటుంది.

వేసవి శిబిరాలతో పిల్లల్లో నూతనోత్తేజం

● డీఆర్ఎం సుధేష్ణ సేన్



బహుమతులు ప్రదానం చేస్తున్న డీఆర్ఎం

గుంటూరు, మే 23 (ఆంధ్రజ్యోతి): వేసవి శిక్షణ శిబిరాలతో పిల్లల్లో నూతనోత్సాహం ఉరకలెత్తుతుందని గుంటూరు రైల్వే డివిజనల్ మేనేజర్ సుధేష్ణ సేన్ అన్నారు. శుక్రవారం పట్టాభిపురంలోని రైల్ వికాస్ భవన్ ప్రాంగణంలో రైల్వే ఆఫీసర్స్ క్లబ్ నిర్వహించిన పిల్లల వేసవి శిక్షణ కార్యక్రమం ముగిసింది. మూడు వారాల పాటు పిల్లలకు పెయింటింగ్, చేతిరాత, కుండల పెయింటింగ్, క్రాఫ్టింగ్ వంటి అంశాల్లో శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా డీఆర్ఎం మాట్లాడుతూ ఇలాంటి శిబిరాల్లో పిల్లలు పాల్గొనడం వల్ల పోటీతత్వం పెరుగుతుందన్నారు. అలానే టీం వర్కు అలవడుతుందన్నారు. ప్లాస్టిక్ వాడకం వల్ల పర్యావరణానికి కలిగే హానికరమైన ప్రభావాలపై పిల్లలకు అవగాహన కల్పించడం ఈ శిబిరం ప్రత్యేకత అన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. రైల్వే సీనియర్ డీపీవో షాబాజ్ హనూర్, సీనియర్ డీఎఫ్ఎం అమూల్య బీ రాజ్ పాల్గొన్నారు.

నారాకోడూరులో కేంద్ర బృందం పర్యటన



నారాకోడూరు సచివాలయాన్ని పరిశీలిస్తున్న కేంద్ర బృందం సభ్యులు

పొన్నూరుటౌన్(చేబ్రోలు) మే 23: చేబ్రోలు మండలం నారాకోడూరు గ్రామంలో శుక్రవారం కేంద్ర బృందం సభ్యులు పర్యటించారు. డిజిటల్ స్మార్ట్ విలేజ్ కార్యక్రమంలో భాగంగా జాతీయ స్థాయి సమృద్ధి విలేజ్ ఎంపికలో భాగంగా నారాకోడూరు గ్రామాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. గ్రామంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న విద్య, వైద్యం, వ్యవసాయం, ప్రాథమిక వ్యవసాయ సొసైటీ, స్వయం సహాయక సంఘాలు, గ్రామ సచివాలయాన్ని పరిశీలించారు. వేజెండ్ల గ్రామంలో సొసైటీని సందర్శించారు. గ్రామ స్థాయిలో ఆయా ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో అమలు అవుతున్న పథకాలు, ప్రజలకు అందుతున్న సేవల గురించి ఆరా తీశారు. కేంద్ర ప్రభుత్వ టెలికమ్యూనికేషన్ డైరెక్టర్‌లు వీవీ ప్రవీణ్, పోస్టల్ సర్వీస్ డైరెక్టర్ కేఎస్ నేల్సా, ఆటిక్య అహ్మద్, ఆరాధ్య స్లామ్, స్థానిక ఎంపీడీవో ఉమాదేవి, డిప్యూటీ డీఎం అండ్ హెచ్‌వో అన్నపూర్ణ, డిప్యూటీ డీఈవో శాంతకుమారి, ఏడీఏ రామకోటేశ్వరి, తహసీల్దార్ శ్రీనివాసశర్మ పాల్గొన్నారు.

గుంటూరు రూరల్ వార్తలు

◆ మంగళగిరి ◆ తాడికొండ ◆ ప్రత్తిపాడు

తగ్గిన పసుపు ధరలు

దుగ్గిరాల, మే 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక పసుపు మార్కెట్ యార్డులో శుక్రవారం జరిగిన వేలంలో 1326 బస్తాల పసుపును రైతులు వ్యాపారులకు విక్రయించారు. పసుపు కొమ్ములు క్వింటాల్ కనిష్ఠ ధర రూ.10,050, గరిష్ఠ ధర రూ.10,950, మోడల్ ధర రూ.10,500 పలికింది. 288 కాయ క్వింటాల్‌కు కనిష్ఠ ధర రూ.10,050, గరిష్ఠ ధర రూ.10,850, మోడల్ ధర రూ.10,500 పలికింది.



ఫిర్యాదులు స్వీకరిస్తున్న సీఆర్డీయే అదనపు కమిషనర్ సూర్య సాయి ప్రవీణ్‌చంద్

అర్జీలు సత్వరమే పరిష్కరించండి

● గ్రీవెన్స్‌లో అధికారులకు సీఆర్డీయే అదనపు కమిషనర్ సూర్యసాయి ప్రవీణ్‌చంద్ ఆదేశం

తుళ్లూరు, మే 23(ఆంధ్రజ్యోతి): తమ సమస్యలు పరిష్కరించాలని రాజధాని అమరావతి రైతులు, రైతు కూలీలు ఇచ్చిన అర్జీలను సత్వరమే పరిష్కరించాలని అధికారులను ఏపీ సీఆర్డీయే అదనపు కమిషనర్ జి.సూర్యసాయి ప్రవీణ్ చంద్ ఆదేశించారు. తుళ్లూరులోని సీఆర్డీయే కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన గ్రీవెన్స్ డేలో నెగోషియేటెడ్ సెటిల్మెంట్ పాలసీ సంబంధిత అంశాలు, లంక భూములు, అసైన్డ్ భూముల సమస్యలపై పలువురు రైతుల నుంచి ఆయన అర్జీలు స్వీకరించారు. లంక, అసైన్డ్ భూముల ఫిర్యాదులపై ప్రభుత్వ ఆదేశాలకనుగుణంగా చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. ప్రతి శుక్రవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1గంట వరకు జరిగే గ్రీవెన్స్‌ను రైతులు వినియోగించుకోవాలని సూచించారు. స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు జి.రవీందర్, ఎం.శేషిరెడ్డి, కె.ఎస్.భాగ్యరేఖ, జి.భీమారావు, కె.స్వర్ణమేరీ, జీఆర్ఎం నోడల్ అధికారి పి.జయశ్రీ, సీఆర్డీయే డీసీడీవో బొర్రా శ్రీనివాసరావు, తహసీల్దార్లు పాల్గొన్నారు.

ఆరు ఇసుక ట్రాక్టర్ల స్వాధీనం

దుగ్గిరాల, మే 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెదకొండూరు రీచ్ నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ఆరు ట్రాక్టర్లను దుగ్గిరాల పోలీసులు శుక్రవారం స్వాధీనం చేసుకున్నారు. ఎలాంటి అనుమతి పత్రాలు లేకుండా ఇసుక అక్రమంగా తరలిస్తున్నారన్న సమాచారంతో ఎస్ఐ ఎస్.వెంకట రవి సిబ్బందితో కలిసి ట్రాక్టర్లను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి తహసీల్దారుకు అప్పగించనున్నట్టు ఎస్ఐ తెలిపారు.

కులగణన ప్రక్రియను వేగవంతం చేయాలి

మంగళగిరి సిటీ, మే 23 (ఆంధ్రజ్యోతి): కేంద్ర మంత్రి మండలి కులగణనకు ఆమోదం తెలుపుతూ విధాన నిర్ణయం తీసుకున్న తర్వాత కూడా విధివిధానాలు రూపొందించకుండా జాప్యం చేయడం తగదని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు పేర్కొన్నారు. ఈ మేరకు బీసీ సంక్షేమ సంఘం కేంద్ర కార్యాలయం ద్వారా శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. దేశంలో వెనుబడిన తరగతులకు చెందిన ప్రజల ఆకాంక్ష మేరకు జాతీయ స్థాయిలో అన్ని రాష్ట్రాల ఓబీసీ సంఘాలు జరిపిన పోరాట ఫలితంగా కేంద్రం కుల గణనకు ఆమోదం తెలపడం సంతోషకరమన్నారు. దేశ వ్యాప్తంగా ప్రజలందరి సామాజిక, ఆర్థిక, విద్య, రాజకీయ, సాంస్కృతిక రంగాల పరంగా వెనుకబాటుతనాన్ని నిర్ధారించేలా శాస్త్రీయంగా కులగణన జరపాలని కోరారు. సమగ్ర కుల గణన ప్రక్రియను వేగవంతంగా పూర్తిచేయాలని విజ్ఞప్తి చేశారు.

నేడు రేషన్ కార్డుల స్పెషల్ డ్రైవ్

తాడేపల్లి(పెనుమాక), మే 23(ఆంధ్రజ్యోతి): పెనుమాక గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద శనివారం ఉదయం 10గంటల నుండి రేషన్ కార్డుల గురించి స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి కొల్లి శేష గ్రామ పార్టీ అధ్యక్షుడు పాలెపు వీరేంద్రనాథ్ ఓ ప్రకటనలో తెలిపారు. రేషన్ కార్డులకు సంబంధించి గ్రామ ప్రజలు తమ అభ్యంతరాలు ఏవైనా గ్రామ పంచాయితీ ఆఫీసు వద్ద తెలిపి రేషన్ కార్డులు పొందాలని కోరారు. గ్రామస్తులు, టీడీ పీ నాయకులు, కార్యకర్తలు, బూత్ కన్వీనర్లు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేడు ఉచిత కంటి వైద్య శిబిరం

తాడేపల్లి టౌన్, మే 23(ఆంధ్రజ్యోతి): స్వర్గీయ ఎన్టీ రామారావు జయంతి సందర్భంగా మంత్రి నారా లోకేశ్ స్ఫూర్తితో పట్టణ టీడీపీ ఆధ్వర్యంలో శనివారం ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 3 గంటల వరకు ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు పట్టణ అధ్యక్షుడు వల్లభనేని వెంకట్రావు తెలిపారు. అమరావతి కంటి ఆసుపత్రి విజయవాడ వారిచే ఈ వైద్య శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వెంకట్రావు పిలుపునిచ్చారు.

ప్రాతూరు రహదారి అధ్వానం

● భారీ గుంతలతో ప్రమాదభరితంగా మారిన వైనం



గుంతలతో అధ్వానంగా మారిన ప్రాతూరు రహదారి

తాడేపల్లి(ప్రాతూరు), మే 23 (ఆంధ్రజ్యోతి): ఎంటీఎంసీ పరిధిలోని ప్రాతూరు గ్రామం వద్ద రహదారి భారీ గుంతలతో ప్రమాదభరితంగా మారి ప్రయాణికులకు చుక్కలు చూపిస్తుంది. బైపాస్ రోడ్డు నుండి నూతక్కి గ్రామం వరకు వెళ్లే ఈ రహదారి మీదుగా పలు గ్రామాల వాసులు నిత్యం ప్రయాణాలు సాగిస్తుంటారు. ప్రాతూరు గ్రామ ప్రారంభంలో రైస్ మిల్లు వద్ద గ్రామ మలుపు వద్ద భారీ గుంతలతో రహదారి అధ్వానంగా మారింది. రెండేళ్ళ క్రితం వేసిన తారురోడ్డు గుంతలమయమైంది. వర్షం వస్తే గుంతల్లో నీరు నిలబడి ప్రయాణికులకు గుంతలు కనిపించక పడిలేస్తూ ఒళ్ళు హూనం చేసుకుంటున్నారు. ఈ మార్గంలో పలుమార్లు ప్రమాదాలు జరిగిన సంఘటనలు కూడా ఉన్నాయి. వర్షం వస్తే రహదారి చిత్తడిగా మారి ప్రయాణికులకు తీవ్ర అసౌకర్యం కలిగిస్తోంది. గ్రామం మధ్యలో రహదారి సైతం గుంతలతో నిండిపోవడమే కాక మరోపక్క రహదారి అంచుల వద్ద భారీగా వర్షపు నీరు నిలబడి ఇబ్బందులు పెడుతోంది. రాత్రి సమయాల్లో ప్రయాణించే వాహనదారులు గుంతలు కనిపించక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి ప్రాతూరు గ్రామం వద్ద అధ్వానంగా ఉన్న రహదారికి మరమ్మతులు చేసి ప్రయాణికుల వెతలు తీర్చాలని గ్రామస్తులు కోరుతున్నారు.



గుంతలమయంగా ఉన్న ప్రాతూరు రహదారి

పున్నమ్మ చెరువును పరిరక్షించాలి

● అక్రమ నిర్మాణాలు కూల్చివేయాలి



పున్నమ్మ చెరువు, పొలం వివాదంపై విచారణ చేస్తున్న డీఎల్‌పీవో శ్రీనివాసరావు

తాడికొండ, మే 23(ఆంధ్రజ్యోతి): తాడికొండ అడ్డరోడ్డులోని పున్నమ్మ చెరువును పరిరక్షించాలని అన్ని రాజకీయ పార్టీల నాయకులు ఏకగ్రీవ తీర్మానాన్ని చేశారు. తాడికొండ అడ్డరోడ్డులో ఉన్న పున్నమ్మ చెరువును, దానికి అనుబంధంగా ఉన్న పొలాన్ని కాపాడాలని కోరుతూ గత నెల 14వ తేదీన పొన్నెకల్లుకు వచ్చిన సీఎం చంద్రబాబుకి గ్రామస్తులు వినతిపత్రాన్ని అందజేశారు. స్పందించిన సీఎం వెంటనే ఉన్నతాధికారులతో మాట్లాడి పూర్తి విచారణ చేపట్టాలని ఆదేశించారు. దీనిపై జాయింట్ కలెక్టర్ భార్గవ్ తేజ పున్నమ్మ చెరువు స్థలాన్ని పరిశీలించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు డీఎల్‌పీవో కే.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో శుక్రవారం తాడికొండ పంచాయతీ కార్యాలయంలో విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా తాడికొండ, పొన్నెకల్లు, నిడుముక్కల గ్రామాలకు చెందిన రైతులు, ప్రజలు, టీడీపీ, సీపీఐ, సీపీఎం, వైసీపీ, బీఎస్పీ, జనసేన పార్టీల నాయకులు పాల్గొని తమ అభిప్రాయాలను వెల్లడించారు. 100 సంవత్సరాల కిత్రం దాతలు పున్నమ్మ చెరువును తవ్వించటంతోపాటు, చెరువు పరిరక్షణ కోసం సుమారు 8 ఎకరాలకుపైగా భూమిని కొనుగోలు చేశారన్నారు. అయితే కొంతమంది రియల్‌ఎస్టేట్ వ్యాపారులు చెరువు స్థలాన్ని అక్రమంగా కాజేశారని పేర్కొన్నారు. చెరువు పూడ్చివేసి అక్రమంగా ఏలాంటి అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపట్టారని, వాటిని వెంటనే కూల్చివేయాలని డిమాండ్ చేశారు. సీఆర్‌డీఏ మాస్టర్ మ్యాప్‌లో ఇప్పటికి చెరువుగా ఉన్నదని తెలిపారు. గతంలో తహసీల్దార్‌గా పనిచేసిన కుటుంబరావు తీసుకున్న తప్పుడు నిర్ణయాల వలన ఈ దుస్థితి వచ్చిందని తెలిపారు. రియల్టర్లు, అధికారులతో కుమ్మక్కై రూ.కోట్లు విలుచేసే భూములను కాజేశారన్నారు. గతంలో చెరువుకు కాపలాదారులుగా ఉన్నవారిని బెదిరించారని పేర్కొన్నారు. ఇప్పటికైనా చెరువును పరిరక్షించి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. డీఎల్‌పీవో శ్రీనివాసరావు మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశాల మేరకు పున్నమ్మ చెరువు స్థలం వివాదంపై వినతిపత్రాలు స్వీకరించి నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామని తెలిపారు. పర్మిషన్లు లేకుండా నిర్మించిన కట్టడాలను తొలగించేందుకు ఆదేశాలు జారీచేస్తామని తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ హరిబాబు, టీడీపీ మండల అధ్యక్షుడు తలశిల ప్రసన్నకుమార్, మాజీ మార్కెట్‌యార్డు చైర్మన్ గుంటుపల్లి మధుసూదనరావు, ఎడ్డూరి హనుమంతరావు, నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు చిగురుపాటి అనూష్, తాడికొండ గ్రామ ఉపసర్పంచ్ ఉయ్యూరు వెంకటరెడ్డి, సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్, నియోజకవర్గ సీపీఐ కార్యదర్శి ముప్పాళ్ల శివశంకరరావు, పచ్చల సాంబశివరావు, సీపీఐ నగర కార్యదర్శి కోట మాల్యాద్రి, ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి పచ్చల శివాజీ, సీపీఎం మండల కార్యదర్శి చింతల భాస్కరరావు, కనగాల పూర్ణచంద్రరావు, బీఎస్పీ నాయకులు శృంగారపాటి బాబూరావు పాల్గొన్నారు.

భారత సైనికులకు అండగా ఉంటాం

● మద్దతుగా రాజధానిలో కూటమి శ్రేణుల తిరంగా ర్యాలీ



తుళ్లూరులో తిరంగా ర్యాలీ నిర్వహిస్తున్న కూటమి శ్రేణులు

తుళ్లూరు, మే 23 (ఆంధ్రజ్యోతి): భారత సైనికులకు దేశ ప్రజలంతా అండగా ఉన్నారని కూటమి నాయకులు స్పష్టం చేశారు. ఆపరేషన్ సిందూర్‌లో విజయం సాధించిన సందర్భాన్ని పురస్కరించుకొని తుళ్లూరులో కూటమి శ్రేణులు శుక్రవారం తిరంగా ర్యాలీ నిర్వహించారు. డాక్టర్ అంబేద్కర్ విగ్రహానికి పూలదండలు వేసి వీర జవాన్‌లకు రెండు నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం గ్రామంలో తిరంగా ర్యాలీ నిర్వహించారు. అనంతరం సినిమాహాలు సెంటర్ వద్ద నేతాజీ సుభాష్ చంద్రబోస్ విగ్రహానికి పూలదండలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో రాజధాని అమరావతి రైతు జేఏసీ నేత పువ్వాడ సుధాకరరావు, టీడీపీ మండల అధ్యక్షుడు ధనేకుల సుబ్బారావు, ఉపాధ్యక్షుడు సాహెబ్ జాన్, గ్రామ పార్టీ అధ్యక్షుడు కాటా అప్పారావు, రాష్ట్ర టీడీపీ కార్యదర్శి దామినేని శ్రీనివాసరావు, మాజీ ఎంపీటీసీ షైనేని గిరిజా, మండల జనసేన పార్టీ అధ్యక్షుడు యర్రగోపు నాగరాజు, బీజేపీ మండల అధ్యక్షుడు నీరుకొండ లక్ష్మీనారాయణ, ఉపాధ్యక్షుడు సరిపూడి సాంబశివరావు, రాష్ట్ర నాయకులు హేమసుందర్, తాడకొండ నియోజకవర్గ బీజేపీ కన్వీనర్ కంతేటి బ్రహ్మయ్య, రాష్ట్ర బీజేపీ నాయకులు కొమ్మినేని సత్యనారాయణ, జిల్లా నాయకులు మార్త నరేంద్రబాబు, టీడీపీ నాయకులు బండ్ల సూరిబాబు, షైనేని సత్యనారాయణ, జమ్ముల అనిల్, పాలకాయల గోపాల్రావు, మొఖమాటం వీరయ్య, మహిళా జేఏసీ నేతలు కామినేని గోవిందమ్మ, పోలు దుర్గా, కూటమి నాయకులు, రాజధాని మహిళలు, రైతులు పాల్గొన్నారు.

దేశ సమగ్రత పరిరక్షణకు 27న బహిరంగ సభ


మంగళగిరి, మే 23 (ఆంధ్రజ్యోతి): మత సామరస్యం, దేశ సమగ్రత పరిరక్షణకై ఈ నెల 27వ తేదీన వామపక్ష పార్టీలు, దళిత, క్రైస్తవ, ముస్లీం సంఘాల ఆధ్వర్యంలో మంగళగిరి అంబేడ్కర్ సెంటరులో బహిరంగ సభ నిర్వహిస్తున్నట్టు ఆయా సంఘాల నేతలు తెలిపారు. బహిరంగ సభ నిర్వహణకు సంబంధించి శుక్రవారం మంగళగిరి సీపీఎం కార్యాలయంలో సన్నాహక సమావేశం నిర్వహించారు. నేతలు మాట్లాడుతూ గత నెల 22న పహల్గాంలో 26 మంది పర్యాటకులను ఉగ్రవాదులు బలిగొన్నారని చెప్పారు. అయితే, కొన్ని శక్తులు ఉగ్రవాదానికి మతంతో ముడిపెట్టి ప్రజల మధ్య చిచ్చు పెట్టాలని చూస్తున్నాయని విమర్శించారు. ఈ నెల 27న జరిగే ర్యాలీ, బహిరంగ సభలో అన్ని వర్గాల ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో సీపీఎం పట్టణ కార్యదర్శి వీసం జవహర్‌లాల్, సీపీఐ పట్టణ కార్యదర్శి అన్నవరపు ప్రభాకర్, సీపీఐ ఎంఎల్ నేత కూరపాటి కోటేశ్వరరావు, వివిధ పార్టీల, సంఘాల నేతలు తదితరులు పాల్గొన్నారు.

పెదపరిమిలో ఉచిత చికిత్సాలయం ప్రారంభం

తుళ్లూరు(పెదపరిమి), మే 23 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పెదపరిమి గ్రామంలో శుక్రవారం ముప్వా చిన బాపిరెడ్డి మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత చికిత్సాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ రఘురామిరెడ్డి మాట్లాడుతూ స్వచ్ఛంద సేవా సంస్థల భాగస్వామ్యంతోనే ఆరోగ్య సామాజిక అభివృద్ధి సాధ్యమన్నారు. డాక్టర్ విద్యావతి వైద్యసేవలు ప్రారంభించారు. గ్రామస్తులందరికీ ఉచిత వైద్యం అందించాలన్న లక్ష్యంతో క్లినిక్ ప్రారంభించడం గొప్ప విషయమని మేనేజింగ్ ట్రస్టీ ఎంవీ రామిరెడ్డి తెలిపారు. సాయంత్రం 5 నుంచి రాత్రి 8 గంటల వరకు వైద్యులు అందుబాటులో ఉంటారన్నారు. రోగులకు ఉచితంగా మందులు పంపిణీ చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉపాధ్యాయ సంఘ నాయకుడు బాడిశ హనుమంతురావు, లాయర్ వాణిశ్రీ, మాజీ సర్పంచ్ భాష్యం సాంబశివరావు, నంబూరు బాబురావు, భాష్యం నరసింహారావు, ట్రస్టీలు వంగా సాంబిరెడ్డి, ముప్వా పూర్ణలలిత, కట్టా కోటిరెడ్డి, ప్రజా ఆలోచన వేదిక అధ్యక్షుడు మేడూరి రాజేంద్రప్రసాద్, కోఆర్డినేటర్ వల్లూరి సదాశివరావు, ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి మున్నంగిసాంబిరెడ్డి పాల్గొన్నారు.

లబ్ధిదారులకు డాక్యుమెంట్ల అందజేత

తాడేపల్లి (పెనుమాక), మే 23 (ఆంధ్రజ్యోతి): ఎంటీఎంసీ పరిధిలోని పెనుమాక గ్రామస్తులకు మంత్రి నారా లోకేశ్ ఇచ్చిన ఇంటిపట్టాలు మంగళగిరి సబ్ రిజిస్ట్రారు ఆఫీసులో రిజిష్టరు చేయించి లబ్ధిదారులకు శుక్రవారం మండల పార్టీ ప్రధాన కార్యదర్శి కొల్లి శేష అందజేశారు. రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లు అందుకున్న లబ్ధిదారులు మంత్రి లోకేశ్‌కు, సహకరించిన కొల్లి శేష, టీడీపీ గ్రామ అధ్యక్షుడు పాలెపు వీరేంద్రనాథ్, గ్రామ మాజీ ఉప సర్పంచ్ పఠాన్ జానీ ఖాన్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.



రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లు అందుకున్న లబ్ధిదారులు

టీడీపీ నేత బిట్రా నాగరాజుకు ఘననివాళి

మంగళగిరి, మే 23 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి పట్టణం ఎల్బీ నగర్‌కు చెందిన టీడీపీ నేత బిట్రా నాగరాజు గురువారం అనారోగ్యంతో కన్నుమూశారు. టీడీపీ నేతలు నాగరాజు భౌతికకాయంపై పార్టీ పతాకాన్ని కప్పి ఘననివాళి అర్పించారు. నాగరాజు మట్టి ఖర్చుల నిమిత్తం మంత్రి లోకేశ్ పంపిన రూ.20 వేల ఆర్థికసాయాన్ని మృతుని కుటుంబసభ్యులకు అందజేశారు. ఏపీ పద్మశాలి కార్పొరేషన్ చైర్మన్ నందం అబద్దయ్య, టీడీపీ పట్టణ అధ్యక్షుడు దామర్ల రాజు, ఉపాధ్యక్షుడు గోవాడ దుర్గారావు, బీసీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుత్తికొండ ధనుంజయరావు, నేతలు జొన్నాదుల వెంకట రామాంజనేయులు, అన్నం నాగబాబు, వంగర సదాశివరావు, షేక్ రియాజ్, జంజనం వెంకట సుబ్బారావు, కారంపూడి బాబూరావు, వంగర పెదలక్ష్మయ్య నాగరాజుకు నివాళులర్పించారు.



ఆర్థికసాయం అందజేస్తున్న అబద్దయ్య తదితరులు

విద్యుత్ సమస్యలు లేకుండా పరిష్కరిస్తాం

● ఆంధ్రజ్యోతి కథనంపై స్పందించిన అధికారులు

పెదనందిపాడు, మే 23(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో విద్యుత్ సమస్యలు లేకుండా పరిష్కరిస్తామని బాపట్ల విద్యుత్ శాఖ సబ్ ఇంజినీర్ గోళ్ల ఆంజనేయులు తెలిపారు. ఆంధ్రజ్యోతిలో 'గాలి వీచిన, చినుకు పడిన వెతలే' అని ప్రచురితమైన కథనంపై స్పందించిన ఆయన మండలంలోని పెదనందిపాడు, వరగాని సబ్‌స్టేషన్లను శుక్రవారం పరిశీలించారు. త్వరలోనే నూతనంగా కరెంటు లైన్లు ఏర్పాటు చేసి ఆ గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయాలు లేకుండా చూస్తామన్నారు.

రాజుపాలెం టీడీపీ అధ్యక్షుడిగా వీరయ్య

మండల పరిధిలోని రాజుపాలెం టీడీపీ అధ్యక్షుడిగా కమ్మ వీరయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శుక్రవారం జరిగిన సమావేశంలో ఈ గ్రామ కమిటీ ఎన్నిక జరిగింది. జనరల్ సెక్రటరీగా రంగయ్య, కార్యదర్శులుగా చుండూరు నరేంద్రబాబు, బాజీ, వై హనుమాయమ్మ, ఆర్గనైజర్ సెక్రటరీలుగా వెంకటేశ్వర్లు, పీ బాజీ, బుల్లిబాబు, ఉపాధ్యక్షుడిగా కోటేశ్వరరావు, కోశాధికారిగా రత్తయ్య, బూత్ కన్వీనర్లుగా బ్రహ్మయ్య, షేక్ సుభానిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సర్పంచ్ కమ్మ నాగమల్లేశ్వరరావు, పలువురు నాయకులు ఈ ఎన్నిక కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఏకగ్రీవాలా.. పోటీనా

● గ్రామకమిటీల్లో ఆజ్యం పోస్తున్న వర్గపోరు
● బూత్ స్థాయి నుంచి క్లస్టర్ వరకు ఇదే పరిస్థితి

పెదనందిపాడు, మే 23 (ఆంధ్రజ్యోతి): మండలంలో గతంలో ఎన్నడూలేని విధంగా టీడీపీలో పార్టీ సంస్థాగత పదవుల కోసం తమ్ముళ్ల మధ్య తీవ్రపోటీ నెలకొంది. మహానాడు పండుగకు ముందే గ్రామస్థాయి నుంచి కమిటీల ఎన్నిక జరుగుతుంది. ఈ నెల 17లోపు సంస్థాగత ఎన్నికలు పూర్తిచేయాలని నేతలు మార్గనిర్దేశం చేశారు. ఈ పరిస్థితుల్లో నేతలు ఎక్కడికక్కడ గ్రామస్థాయి కమిటీలకు సిద్ధమయ్యారు. తీరా కమిటీల ఎన్నికల్లో తలెత్తిన వర్గపోరు నియోజకవర్గ నేతలకు కంటిమీద కునుకు లేకుండా చేస్తుంది. నియోజకవర్గంలో టీడీపీకి కంచుకోటగా ఉన్న పెదనందిపాడు మండలంలో ప్రస్తుతం 17 గ్రామాలకు ఒక్క గ్రామం మినహా అన్ని గ్రామాల్లో ఇరువర్గాల మధ్య తీవ్ర పోటీ నెలకొంది. దీంతో గ్రామాల్లో పరిశీలకుల సమక్షంలో కమిటీల ఎన్నిక నిర్వహించి, జాబితాలను నియోజకవర్గ కార్యాలయానికి పంపిస్తున్నారు. గ్రామ కమిటీల ఎన్నిక అనంతరం మండల కమిటీని ఎన్నుకోవాల్సి ఉంటుంది. మండల అధ్యక్ష పదవికి కూడా ఆశావహులు పెద్దఎత్తున పోటీపడుతున్నారు. గ్రామ కమిటీలను ఏకగ్రీవం చేసుకుంటే మండల అధ్యక్ష పదవి తమకే దక్కుతుందని ఎవరికి వారు పావులు కదుపుతున్నారు.

వర్మీ కంపోస్టు పిట్లు ఎంతో మేలు

● రైతులకు డ్వామా ప్రాజెక్ట్ డైరెక్టర్ శంకర్ సూచన

ప్రత్తిపాడు, మే 23 (ఆంధ్రజ్యోతి): వర్మీ కంపోస్టు పిట్ల ఏర్పాటు వల్ల రైతులకు ఎంతో మేలు కలుగుతుందని డ్వామా పీడీ శంకర్ తెలిపారు. మండల పరిధిలోని తిక్కిరెడ్డిపాలెంలో వర్మీ కంపోస్టు పిట్లను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో ఆయన మాట్లాడుతూ పిట్లలో తయారైన ఎరువుల వల్ల పొలాలు సారవంతమవుతాయన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మాకినేని జగన్, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.



ప్రత్తిపాడు: వర్మీకంపోస్టు పిట్‌లను పరిశీలిస్తున్న డ్వామా పీడీ శంకర్

ఉపాధి పనులను సద్వినియోగం చేసుకోవాలి

పెదనందిపాడు: రైతులు ఉపాధి పనులను సద్వినియోగం చేసుకోవాలని డ్వామా ప్రాజెక్ట్ డైరెక్టర్ శంకర్ సూచించారు. మండలంలోని పమిడివారిపాలెం, కత్రపాడు, నాగులపాడులో జరుగుతున్న ఉపాధి పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు. మండలంలో మంజూరైన 26 కంపోస్టు పిట్లను వెంటనే నిర్మించుకోవాలన్నారు. జూన్ కల్లా ఫాం పాండ్స్, కంపోస్టు పిట్లను పూర్తి చేయాలని తెలిపారు. నాగులపాడు, కత్రపాడులో తాగునీటి చెరువుల పూడికతీత పనులను ఇంజనీర్ల కొలతల ప్రకారం చేయాలని, పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని, అవకతవకలకు పాల్పడితే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఆయన వెంట ఎంపీడీవో లక్ష్మీదేవి, ఏపీవో సాంబశివరావు, ఈసీ రాజా, టీఏ ఎస్ శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

సబ్సిడీపై పచ్చి రొట్ట విత్తనాలు

వట్టిచెరుకూరు, మే 23 (ఆంధ్రజ్యోతి): అడపాదడపా వర్షాలతో సాగుకు భూములు పదునయ్యాయి. ఈ క్రమంలో భూసారానికి జనుము, పిల్లిపెసర, జీలుగ విత్తనాలు 50శాతం సబ్సిడీపై పంపిణీ చేసేందుకు రైతు సేవా కేంద్రాల్లో సిద్ధంగా ఉన్నాయని ఏవో లక్ష్మి తెలిపారు. పచ్చిరొట్ట విత్తనాలు విత్తుకుని పైర్లను దుక్కుల్లో కలిసేవిధంగా చేసుకుంటే భూములు సారవంతమవుతాయన్నారు. జీలుగ కేజీ రూ.123 ఉండగా సబ్సిడీ పోగా 61.50, జనుము కేజీ రూ.109 ఉండగా రూ.54.50, పిల్లి పెసర కేజీ రూ.150 ఉండగా రూ.90 చెల్లించి విత్తనాలను పొందాలన్నారు.

ముట్లూరులో ఉచిత వైద్య శిబిరం

వట్టిచెరుకూరు, మే 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముట్లూరు గ్రామంలో భాస్కర్ ఫ్రెండ్ సర్కిల్ ఆధ్వర్యంలో కాటూరి మెడికల్ కళాశాల, హాస్పటల్ సౌజన్యంతో శుక్రవారం నిర్వహించిన మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఉచిత వైద్య శిబిరానికి 300మంది వరకు హాజరు కాగా అధిక శాతం కంటి సమస్యలు, శుక్లాల సమస్యలు ఉన్నవారిని పరీక్షించి మందులు పంపిణీ చేశారు. సుమారు వంద మంది వరకు శుక్లాల సమస్యలను నిర్ధారించారు. వీరిని శనివారం గ్రామంలోని శివాలయం నుంచి కాటూరి హాస్పటల్‌కు బస్సులో తీసుకెళ్లి ఉచితంగా వైద్యం అందిస్తామని నిర్వాహకులు తెలిపారు.

రాష్ట్ర కౌన్సిల్ సమావేశాలను జయప్రదం చేయండి

● గుంటూరు జిల్లా అధ్యక్షుడు చాంద్ బాష

మేడికొండూరు, మే 23 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి జూన్ 5న విజయవాడలో నిర్వహించతలపెట్టిన రాష్ట్ర కౌన్సిల్ సమావేశాలను జయప్రదం చేయాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం గుంటూరు జిల్లా అధ్యక్షుడు చాంద్‌బాష కోరారు. మేడికొండూరులోని పీహెచ్‌సీలో శుక్రవారం జరిగిన ఉద్యోగుల సమావేశంలో ఆయన ప్రసంగించారు. ఈ సందర్భంగా ఛలో విజయవాడ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కోశాధికారి పోతురాజు, ఫిరంగిపురం తాలూకా యూనిట్ కార్యదర్శి కె.దాసు తదితరులు పాల్గొన్నారు.

మూడు గ్రామాల్లో టీడీపీ ఎన్నిక

పెదనందిపాడు, మే 23 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని అన్నవరం, పాలపర్రు, రాజుపాలెం గ్రామాల్లో శుక్రవారం టీడీపీ గ్రామ కమిటీ ఎన్నిక జరిగింది. ఎన్నికల పరిశీలకులుగా టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి దామంచర్ల శ్రీనివాసరావు, మేళ్ల సైదయ్యలు నాయకుల అభిప్రాయాలను సేకరించి కమిటీ సభ్యుల నివేదికను నియోజకవర్గ కార్యాలయానికి పంపించనున్నట్లు తెలిపారు.



లబ్ధిదారుడికి సీఎంఆర్‌ఎఫ్ చెక్కును అందజేస్తున్న టీడీపీ నాయకులు

ఆత్మకూరులో సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

మంగళగిరి సిటీ, మే 23(ఆంధ్రజ్యోతి): మంగళగిరి మండలం ఆత్మకూరు గ్రామంలో ముగ్గురు లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను టీడీపీ నేతలు శుక్రవారం పంపిణీ చేశారు. గ్రామానికి చెందిన పులివర్తి అభిరామ్‌కు రూ.6,04,282, మన్యం బాలాజీకి రూ.3,01,700, వెలువల వరలక్ష్మీకి రూ.49,324 చొప్పున మంజూరైన చెక్కులను నేతలు లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి అందజేశారు. ఈ సందర్భంగా టీడీపీ గుంటూరు పార్లమెంటు ప్రధాన కార్యదర్శి పోతినేని శ్రీనివాసరావు మాట్లాడుతూ మంత్రి నారా లోకేశ్ ప్రత్యేక చొరవతో మంగళగిరి నియోజకవర్గానికి సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను మంజూరు చేయిస్తున్నారని చెప్పారు. రాష్ట్రంలో పేదల ఆరోగ్యానికి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని, రూ.లక్షలు ఖర్చు చేసి కార్పొరేట్ ఆసుపత్రుల్లో చికిత్స చేయించుకోలేని వారికి సీఎంఆర్‌ఎఫ్ ద్వారా అండగా నిలుస్తుందని తెలిపారు. కార్యక్రమంలో సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ డైరెక్టర్ తోట పార్థసారధి, టీడీపీ గ్రామ అధ్యక్షుడు తాటి వెంకట్రావు, నేతలు కొమ్మా సుకుమార్, శాసనం మాణిక్యరావు, మన్యం సుబ్బారావు, మోతుకూరి రవి, కొండపల్లి మధుబాబు, గద్దె రామస్వామి, ఏడుకొండలు, ఎర్రమాల లాజర్, అల్లూరి శ్రీను, జాలాది రవి తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తీసుకోవాలి

మంగళగిరి, మే 23(ఆంధ్రజ్యోతి): బార్లు, మద్యం దుకాణాలు నిబంధనలు ఉల్లంఘిస్తే కేసులు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ జిల్లా అధికారి వి.అరుణకుమారి ఆదేశించారు. మంగళగిరి ఎక్సైజ్ శాఖ కార్యాలయాన్ని శుక్రవారం ఆయన సందర్శించారు. స్టేషన్ పరిధిలో వున్న మద్యం దుకాణాలు, బార్ అండ్ రెస్టారెంట్ల నిర్వహణ, సమయపాలన, కేసుల వివరాలను గురించి అడిగి తెలుసుకున్నారు. మద్యం దుకాణాల్లో ఎమ్మార్పీ ధరలను ఉల్లంఘించినా, సమయపాలన పాటించకపోయినా కేసులు నమోదు చేయాలని సూచించారు. గత జనవరి ఒకటో తేదీ నుంచి జిల్లాలో మొత్తం 347 కేసులు నమోదు చేసి, 308మందిని అరెస్టు చేయడంతోపాటు 7 వాహనాలను సీజ్ చేశామని తెలిపారు. 78 లీటర్ల డిఫెన్స్ మద్యం, 109 బెల్ట్ షాపులకు సంబంధించి 257.76 లీటర్ల మద్యం, 10.40 లీటర్ల బీరు సీజ్‌చేసినట్టు వెల్లడించారు. ఏడు గంజాయి కేసుల్లో 14మందిని అరెస్టు చేసి 1.698 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నామన్నారు. 160 బహిరంగ మద్యపానం కేసుల్లో 161 మందిపై కేసులు నమోదు చేశామన్నారు. కార్యక్రమంలో మంగళగిరి ఎక్సైజ్ సీఐ జీ.వీరాంజనేయులు, ఎస్ఐ కే.రవికుమార్, ఎ.పద్మజ, సిబ్బంది పాల్గొన్నారు.

తెనాలి వార్తలు

◆ తెనాలి ◆ పొన్నూరు

ముఖ్యమంత్రి చిత్రపటానికి డీలర్ల పాలాభిషేకం

పొన్నూరు టౌన్, మే 23 (ఆంధ్రజ్యోతి): ఎండీయూ ఆపరేటర్ వాహనాలను ఎత్తివేస్తూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి రేషన్ డీలర్లు హర్షం వ్యక్తం చేస్తున్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద శుక్రవారం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చిత్రపటానికి పొన్నూరు పట్టణ, మండలానికి చెందిన రేషన్ డీలర్లు పాలాభిషేకం నిర్వహించారు. వైసీపీ ప్రభుత్వంలో రేషన్ డీలర్లను పక్కనపెట్టి ఎండీయూ వాహనాల ద్వారా బియ్యాన్ని సరఫరా చేశారు. జూన్ నుంచి డీలర్ల వద్దే బియ్యం సరఫరా చేయనుండటంపై రేషన్ డీలర్లు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుతూ ముఖ్యమంత్రి చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు.

నయనానందకరంగా వీరాంజనేయుని కల్యాణోత్సవం

పొన్నూరు టౌన్, మే 23 (ఆంధ్రజ్యోతి): హనుమత్ జయంతి ఉత్సవాలలో భాగంగా గురువారం రాత్రి సువర్చల సమేత వీరాంజనేయస్వామి కల్యాణ మహోత్సవం నయనానందకరంగా సాగింది. ఆలయంలో ప్రత్యేకంగా అలంకరించిన కల్యాణ వేదికపై సువర్చల సమేత వీరాంజనేయస్వామి ఉత్సవ మూర్తులను అర్చక స్వాములు ప్రతిష్ఠించారు. వేద పండితుల మంత్రోచ్చరణల నడుమ స్వామి వారి కల్యాణం కన్నుల పండుగలా సాగింది. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. శుక్రవారం స్వామి వారి దివ్య రథోత్సవం పొన్నూరు పుర వీధులలో ఊరేగింది. రథోత్సవం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కోలాట ప్రదర్శన, సంప్రదాయ డప్పు వాయిద్యాలు విశేషంగా ఆకట్టుకున్నాయి.



మామిళ్లపల్లిలో దంత పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

100 మందికి దంత వైద్య పరీక్షలు

పొన్నూరు టౌన్, మే 23 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మామిళ్లపల్లిలో శుక్రవారం సిబార్ డెంటల్ కళాశాల ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో వందమందికి దంత పరీక్షలు నిర్వహించి దంతాల సంరక్షణకు సూచనలు చేశారు. శిబిరంలో ప్రొఫెసర్ దేవకి, డాక్టర్ శ్రావణి, డాక్టర్ శ్వేతశ్రీ, డాక్టర్ కావ్య శ్రావణి, డాక్టర్ సృజన, జూనియర్ వైద్యులు వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

చలో విజయవాడను జయప్రదం చేయండి: కమలకుమారి

తెనాలి, మారీసుపేట,మే 23 (ఆంధ్రజ్యోతి): వచ్చే నెల 5న విజయవాడలో జరిగే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల రాష్ట్ర సంఘ రాష్ట్ర కౌన్సిల్ సమావేశాలను జయప్రదం చేయాలని ఏపీజీఈఏ ప్రధాన కార్యదర్శి కారుమూరు కమలకుమారి అన్నారు. శుక్రవారం స్థానిక కొత్తపేటలోని పాత ప్రభుత్వ వైద్యశాల ప్రాంగణంలో సహకార శాఖ ఉద్యోగ సంఘ సభ్యులు చలో విజయవాడ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని గోడప్రతులను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఏపీజీఈఏ ప్రధాన కార్యదర్శి కారుమూరు కమలకుమారి పాల్గొని సంఘ సభ్యులతో కలసి గోడ ప్రతులను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వచ్చె నెల జూన్ 3వ తేది నుంచి జరగనున్న ఏపీఈఏ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలన్నారు. ముఖ్యంగా జూన్ 5న ప్రభుత్వ ఉద్యోగు సంఘ రాష్ట్ర కౌన్సిల్ సమావేశాలకు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుని ఆహ్వానించామన్నారు. తెనాలి యూనిట్, దుగ్గిరాల యూనిట్‌లో ఉన్న ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లు, కార్మికులు పెద్దఎత్తున పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో ఏపీజీఈఏ ఆర్గనైజింగ్ సెక్రటరీ దగ్గుబాటి సుధీర్, ఉపాధ్యక్షుడు దీపాల శ్రీనివాసరావు, షేక్ అన్వర్, దుగ్గిరాల అధ్యక్షుడు అందెల బాల చంద్రమౌళి, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

నిర్ణీత సమయంలో ఉపాధి పనులను పూర్తి చేయాలి: ఏపీవో వెంకయ్య

కొల్లిపర, మే 23 (ఆంధ్రజ్యోతి): మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనులను నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని ఏపీవో వెంకయ్య అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని దావులూరిపాలెం, దావులూరు, హనుమాన్‌పాలెం, అన్నవరం, కొల్లిపర తదితర గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఆయన పరిశీలించారు. ఉపాధి హామీ పనులపై కూలీలు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి తగిన సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా వెంకయ్య మాట్లాడుతూ పేదప్రజలందరూ ఉపాధిహామీ పనులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఉపాధిహామీ పనుల్లో పాల్గొనే కూలీలకు చేసిన పనుల బట్టి వేతనం ఇవ్వడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్‌లు వల్లభాపురం బుజ్జి, కనపర్తి సాగర్, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రంలో మజ్జిగ పంపిణీ

తెనాలి, మారీసుపేట, మే 23 (ఆంధ్రజ్యోతి): బోసురోడ్డులోని పొట్టి శ్రీరాములు విగ్రహం సమీపంలో అన్నదాత సుఖీభవ సంఘ సభ్యులు నిర్వహిస్తున్న వేసవి చలివేంద్రంలో చల్లని మజ్జిగను పంపిణీ చేశారు. శుక్రవారం అన్నదాత సుఖీభవ సంఘ సభ్యులు కొడాలి సూర్యప్రకాశరావు 21వ వర్ధంతి సందర్భంగా అల్లుడు మొవ్వ సత్యనారాయణ, మనుమరాలు, మనుమడు రోహిణి, రఘుబాబు కుటుంబ సభ్యుల సహకారంతో పాదచారులకు చల్లని మజ్జిగ, మంచినీరును పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంఘ సభ్యులు మొవ్వా సత్యనారాయణ, శ్రీనివాసరావు, ప్రతాప్, వాసు, ప్రదీప్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ స్టేడియం నిర్వహణ అధ్వానం



ఇండోర్ స్టేడియంలో పడుతున్న వర్షపు నీటిని పట్టేందుకు పెట్టిన డస్టుబిన్లు

- వర్షం వస్తే తడిచిపోతున్న టెన్నిస్ కోర్టు
- డస్టుబిన్లతో నీరు పట్టే పరిస్థితి
- నీటితో ఉడెన్ షటిల్ కోర్టుకు ముప్పు
- స్టేడియంలోనూ సమస్యలు కోకొల్లలు

తెనాలి రూరల్, మే 23 (ఆంధ్రజ్యోతి): క్రీడలను ప్రోత్సహిస్తూ జాతీయ, అంతర్జాతీయ క్రీడాకారులుగా తెనాలి ప్రాంత యువతను తీర్చిదిద్దాలన్న ఆశయంతో చెంచుపేటలోని అమరావతి ప్లాట్లలో ఏర్పాటుచేసిన ఎన్టీఆర్ ఇండోర్ స్టేడియం నిర్వహణ లోపంతో కునారిల్లుతోంది. చిన్నపాటి వర్షానికే పైకప్పునుంచి నీరు కారుతూ డస్ట్‌బిన్లు పెట్టి ఆ నీటిని పట్టే పరిస్థితి ఇండోర్ స్టేడియంలో ఉంది. వైసీపీ ప్రభుత్వం ఇండోర్ స్టేడియం నిర్వహణ బాధ్యతలను ప్రైవేట్ వ్యక్తుల చేతుల్లో పెట్టింది. నామమాత్రపు రుసుముతో స్టేడియం వినియోగించుకునే క్రీడాకారులకు సైతం కాంట్రాక్టర్లు పెంచిన ఫీజులతో ఆర్థిక భారంగా మారింది. కాంట్రాక్టర్లు ఇండోర్ స్టేడియంలో ఆటలకు మాత్రం ఫీజులు వసూలు చేస్తుండగా మౌలిక వసతులు కల్పించడంలో మాత్రం శ్రద్ధ చూపడంలేదన్న ఆరోపణలు ఉన్నాయి. ఇటీవల కురుస్తున్న వర్షాలతో పైకప్పునుంచి నీరు కారుతున్నది. స్టేడియం కాంట్రాక్టర్‌కు రుసుం ముట్టజెప్పి క్రీడలకు వస్తుంటే నిర్వహణ లోపంతో వర్షపు నీరు కోర్టులపై పడతుండటంపై క్రీడాకారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. క్రీడాకారులు షటిల్ ఆడేందుకు అనువుగా ఉడెన్ కోర్టు కావడంతో వర్షపునీరు కిందపడి తడిస్తే నాని నిరుపయోగంగా మారే పరిస్థితి ఉంది. వర్షపు నీరుపడే ప్రాంతంలో డస్ట్ బిన్నులను ఏర్పాటుచేసి అవి నిండిన తర్వాత బయట పారబోసేలా తాత్కాలిక చర్యలు చేపట్టారు. వేలల్లో ఫీజులు వసూలు చేస్తూ కాంట్రాక్టర్ స్టేడియంలోని సమస్యలపై దృష్టిపెట్టకపోవడంపై పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇండోర్ స్టేడియం నిర్వహణను ప్రభుత్వమే చేపట్టాలని పలువురు కోరుతున్నారు. ఇండోర్ స్టేడియంలో నెలకొన్న సమస్యలపై ఉన్నతాధికారులు దృష్టిపెట్టి తక్షణమే మరమ్మతులు చేపట్టి షటిల్ కోర్టు దెబ్బతినకుండా చర్యలు చేపట్టాలని క్రీడాకారులు కోరుతున్నారు.

మట్టితో వాకింగ్ ట్రాక్..

ఇండోర్ స్టేడియం చుట్టూ ఏర్పాటు చేసిన వాకింగ్ ట్రాక్ బురద మట్టితో నిండి ఉంటోంది. చుట్టూ గడ్డిపెరిగి విష కీటకాలకు ఆవాసయోగ్యంగా ఉంది. వర్షం కురిస్తే ట్రాక్‌లాంటి మట్టి దారిలో వర్షపు నీరు నిలిచి ఉంటాయి. అదేవిధంగా చుట్టూనడిచే క్రమంలో పాము పుట్టలు, చెట్ల పొదలు పెరిగి ఉండటంతో భయం భయంగానే నడిచే పరిస్థితి. వర్షపు నీరు ఇంకిపోయిన తరువాత వాకర్లు గమనించక బురదతో జారి కిందపడిన సంఘటనలు ఉన్నాయి.

నిరుపయోగంగా ఓపెన్ జిమ్ పరికరాలు

స్టేడియంలో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్ చూడటానికే తప్ప వ్యాయామానికి పనికి రానివిధంగా మారింది. కొద్ది కాలానికే ఇవి మరమ్మతులకు గురవటంతో వాటిని వినియోగించలేని పరిస్థితి. వీటిపై అధికారులకు ఫిర్యాదుచేసినా ప్రయోజనం శూన్యమేనని పలువురు వాపోతున్నారు.

మైదానంలో వర్షపు నీరు.. పెరిగిన గడ్డి

క్రీడలాడేందుకు అనువుగా ఉన్న మైదానం కాస్తా నిర్వహణ లోపంతో నేడు చిన్నపాటి వర్షానికే నీళ్లు నిలుస్తున్నాయి. దీనికి తోడు మైదానంలో గడ్డిజాతి మొక్కలు పెరుగుతున్నాయి. వేసవి శెలవలు కావడంతో ఆటలాడేందుకు పెద్ద సంఖ్యలో చిన్నారులు వస్తున్నారు. స్టేడియం మైదానంలో నీరు నిలిచిఉండటంతో ఆటలు ఆడలేక వెళ్లిపోతున్నారు.

కళావిహీనంగా స్టేడియం బిల్డింగ్

ఇండోర్ స్టేడియం బిల్డింగ్ రంగులు వెలసిపోయి అద్దాలు పగిలి కళావిహీనంగా మారింది. దీని చుట్టూ పరిసరాలు సైతం పిచ్చిమొక్కలతో నిండి బూత్ బంగళాను తలపిస్తున్నాయి. ఇక్కడి భవనాల దుస్థితిపై తల్లి దండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ప్రభుత్వం సమస్యలు పరిష్కరించాలి

తెనాలి ఇండోర్ స్టేడియంపై ప్రభుత్వం దృష్టిసారించాలని పలువురు కోరుతున్నారు. గత వైసీపీ ప్రభుత్వం స్టేడియం నిర్వహణ ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించడంతో క్రీడాప్రాంగణాలను వ్యాపార కేంద్రాలుగా మలిచారని కనీస సౌకర్యాలు కూడా కరువై స్టేడియం నిరుపయోగంగా మారుతోందని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తెనాలిలో విశాలమైన ప్రాంగణంగా ఉన్న స్టేడియంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టి ఇండోర్ స్టేడియంను మరమ్మతులు చేపట్టడంతో పాటు, ఓపెన్ జిమ్ పరికరాలు, వాకింగ్ ట్రాక్ వంటివి మరమ్మతులు చేయించాలని క్రీడాకారులు కోరుతున్నారు.



మైదానంలో, వాకింగ్ ట్రాక్‌లో నిలిచి ఉన్న వర్షపు నీరు

1 నుంచి రేషన్ షాపుల్లోనే బియ్యం

డీలర్ల సమావేశంలో తహసీల్దార్ గోపాలకృష్ణ

తెనాలి రూరల్, మే 23 (ఆంధ్రజ్యోతి): డీలర్ల నుంచి కార్డుదారులు నేరుగా సరుకులు తీసుకునేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని జూన్ 1నుంచి అమలులోకి రానుందని తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణ చెప్పారు. శుక్రవారం మండల తహసీల్దార్ కార్యాలయంలో ఇందుకు సంబంధించి డీలర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణ మాట్లాడుతూ గతంలో రేషన్ పంపిణీ ఎండీయూ వాహనాల ద్వారా జరిగేవన్నారు. ఆ సమయంలో పెద్దసంఖ్యలో కార్డుదారులు తమకు బియ్యం, నిత్యావసర సరకులు అందడంలేదని ఫిర్యాదులు చేశారన్నారు. దీంతో ప్రభుత్వం దీనిపై అధ్యయనం చేసిందని, బియ్యం కోసం వాహనదారులు పనులు మానుకుని ఎదురు చూసే పరిస్థితి లబ్ధిదారుల్లో ఏర్పడిందన్నారు. డీలర్ల వద్ద అయితే ఉదయం నుంచి రాత్రి వరకూ వారికి నచ్చిన సమయంలో వచ్చి తీసుకునే వెసులుబాటు ఉండేదన్నారు. ఎక్కువమంది పాత విధానంలోనే రేషన్ సరకులు పంపిణీ జరిగేలా చూడాలని కోరారని వివరించారు. దీంతో వచ్చే నెల నుంచి డీలర్ల వద్దనే 1 నుంచి 15వ తారీకులోపు ఎప్పుడైనా కార్డుదారులు వెళ్లి బియ్యం, కందిపప్పు, వంటి నిత్యావసరాలను పొందవచ్చన్నారు. అదేవిధంగా 60ఏళ్లు దాటిన వృద్ధులకు, దివ్యాంగులకు ఇంటి వద్దనే బియ్యం పంపిణీ చేసేలా ఆదేశాలున్నాయన్నారు. రేషన్ డీలర్లు కార్డుదారులకు తగిన గౌరవం ఇవ్వాలన్నారు. రేషన్ షాపుల వద్ద పరిశుభ్రతలు పాటించాలన్నారు. తాగునీరు ఇతర సౌకర్యాలను తప్పనిసరిగా ఏర్పాటు చేయాలన్నారు. పంపిణీ సమయం ముగిసిన తరువాత ఎవరైనా లబ్ధిదారులు తమకు బియ్యం అందించాలని వస్తే అందుకు అనుగుణంగా సరుకులు అందించాల్సి ఉంటుందన్నారు. ఇకపై రేషన్ డీలర్లు తప్పనిసరిగా దుకాణాలను తెరచి ఉంచుతూ లబ్ధిదారులకు సకాలంలో సరుకులు అందించాలని ఆయన సూచించారు. ఎక్కడా కూడా లబ్ధిదారుల నుంచి డీలర్ల తీరుపై ఫిర్యాదులు రాకుండా చూసుకోవాల్సిన బాధ్యతకూడా వారిపైనే ఉందన్నారు. రేషన్ సరుకుల పంపిణీలో లబ్ధిదారులకు ఎవైనా సమస్యలుంటే తనకు నేరుగా ఫిర్యాదు చేయవచ్చన్నారు. ప్రతి డీలర్‌పాయింట్ల వద్ద తప్పనిసరిగా తహసీల్దార్ నెంబరు ఉంటుందని వివరించారు. సమస్యలున్న వారు తనకు ఫోన్ ద్వారా కాని మెసేజ్ రూపంలోనైనా తెలిపితే తక్షణమే చర్యలు తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు. కార్యక్రమంలో పలువురు డీలర్లు, ఎండీయూ ఆపరేటర్లు, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ గోపాలకృష్ణ

చెత్తరహిత పట్టణంగా తెనాలిని సాధిద్దాం

- మున్సిపల్ కమిషనర్ శేషన్న

తెనాలి, మారీసుపేట, మే 23 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఇంటా బయటా వచ్చే చెత్తను రోడ్లపై పోయకుండా పారిశుధ్య కార్మికులకు అందించి చెత్తరహిత పట్టణంగా తెనాలిని సాధించేందుకు ప్రజలు సహకరించాలని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న అన్నారు. శుక్రవారం స్థానిక ముత్తెంశెట్టిపాలెం 16వ వార్డులో జరుగుతున్న పారిశుధ్య పనులను మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న అధికారులతో కలసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ శేషన్న మాట్లాడుతూ పట్టణంలో శానిటేషన్‌పై స్పెషల్ డ్రైవ్ చేపట్టామన్నారు. డ్రెయిన్‌లు, మురుగుకాలువలోని వ్యర్థాలను పూర్తిగా తొలగించి వర్షాకాలం నాటికి డ్రెయిన్లలో పూడికతీత పనులను పూర్తిచేసి మురుగు నీటి పారుదలకు అడ్డంకులు ఏర్పడకుండా చేస్తున్నామన్నారు. అనంతరం 17, 18వ వారుల్డలో జరుగుతున్న శానిటేషన్ పనులను పరిశీలించి శానిటేషన్ సిబ్బంది పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో మునిసిపల్ అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

శానిటేషన్ పనుల పరిశీలన

పురపాలక సంఘ పరిధిలోని చినరావూరు తోటలో జరుగుతున్న శానిటేషన్ పనులను మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పారిశుధ్యంపై ప్రత్యేక ప్రణాళికలు రూపొందించామన్నారు. ప్రధానంగా డ్రెయిన్లలోని సిల్ట్‌ను తొలగిస్తున్నామన్నారు. వర్షాకాలం నాటికి సిల్ట్ తొలగింపు పనులను పూర్తిచేస్తామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో మునిసిపల్ అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



సిబ్బందికి సూచనలను చేస్తున్న కమిషనర్ శేషన్న తదితరులు

జిల్లా అదనపు కోర్టు పీపీగా సాంబశివరావు

తెనాలి అర్బన్, మే 23 (ఆంధ్రజ్యోతి): 11వ జిల్లా అదనపు కోర్టు అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా ఎంవీ సాంబశివరావును నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. పట్టణంలో న్యాయవాదిగా పనిచేస్తున్న ఆయన శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బేతాళ ప్రభాకర్, కార్యదర్శి హరిదాసు గౌరీశంకర్, ఉపాధ్యక్షులు అన్నం పిన్నారావు, సభ్యులు ఆయనను అభినందించారు.



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న సీడీపీవో సుజాత

బాలికల ఉజ్వల భవిష్యత్తు కోసమే కిశోరి వికాసం

- సీడీపీవో సుజాత

కొల్లిపర, మే 23 (ఆంధ్రజ్యోతి): బాలికల ఉజ్వల భవిష్యత్తు కోసమే కిశోరి వికాసం కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని సీడీపీవో సుజాత అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని అత్తోట అంగన్‌వాడీ కేంద్రంలో కిశోరి వికాసం వేసవి సెలవుల శిక్షణ కార్యక్రమంలో ఆమె పాల్గొని ప్రసంగించారు. కార్యక్రమానికి ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాధిక అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా సుజాత మాట్లాడుతూ బాలికలు రక్తహీనత, వ్యక్తిగత పరిశుభ్రతపై ప్రభుత్వం కల్పిస్తున్న రక్షణ చట్టాలు, లింగ వివక్షపై అవగాహన కలిగి ఉండాలన్నారు. తల్లిదండ్రులు ఆడపిల్లలను మగ పిల్లలతో సమానంగా చూడాలన్నారు. బాలికలను చదివించడం వలన ఆ కుటుంబం ఆర్థికంగా అభివృద్ధి చెందటానికి అవకాశం ఉందన్నారు. చిన్నతనంలో వివాహం చేయడం వలన అనేక ఇబ్బందులకు గురికావాల్సి వస్తుందన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వెంకటలక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యమైన సమాజమే దేశాభివృద్ధికి కొలమానం: రాజకుమారి

తెనాలి అర్బన్, మే 23 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్యమైన సమాజమే దేశాభివృద్ధికి కొలమానమని మహిళ కమిషన్ మాజీ ఛైర్‌పర్సన్ నన్నపనేని రాజకుమారి చెప్పారు. తెనాలి రామకృష్ణ కవి కళాక్షేత్రంలో శారదా సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఆరోగ్య పరీక్షలపై రూపొందించిన కరపత్రాలను ఆవిష్కరించారు. గత 35ఏళ్లుగా వైద్య రంగంలో సామాన్య ప్రజలకు డాక్టర్ శారద విశేష సేవలు అందిస్తున్నారని కొనియాడారు. స్త్రీల కోసం చేస్తున్న వైద్య పరీక్షలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. శిబిరంలో బీపీ, షుగర్, థైరాయిడ్, అల్ట్రాసౌండ్, చెస్ట్ ఎక్స్‌రే, క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు ఉచితంగా నిర్వహించారు. ప్రతి ఒక్కరూ ఈ పరీక్షలను చేయించుకుని ఆరోగ్యంగా ఉండాలన్నారు. తక్కెళ్లపాడు కిమ్స్ చక్ర క్యాన్సర్ హాస్పటల్ సహకారంతో స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. డాక్టర్ శారద, వైద్యులు, సొసైటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న రాజకుమారి, శారద

పొన్నూరులో తిరంగా ర్యాలీ

పొన్నూరు టౌన్, మే 23 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఐలాండ్ సెంటర్‌లో భారతీయ జనతా పార్టీ, టీడీపీ, జనసేన పార్టీల ఆధ్వర్యంలో శుక్రవారం తిరంగా ర్యాలీ చేపట్టారు. జాతీయ పతాకాలను చేతబూనిన నాయకుల పహల్గాం ఉగ్రవాద దాడిలో మృతులకు నివాళులు అర్పించారు. ఆపరేషన్ సింధూర్‌లో పాల్గొన్న భారతీయ సైనిక వీరులకు వందన సమర్పణ చేశారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఆపరేషన్ సింధూర్‌ను చేపట్టి పాకిస్థాన్ ప్రేరేపిత ఉగ్రవాద చర్యలను తుదిముట్టించే చర్యలు ప్రారంభించారన్నారు. కూటమి పార్టీల నాయకులు పొన్నూరు పట్టణంలోని పలు వీధులలో ర్యాలీ నిర్వహించి నినాదాలు చేశారు. ఈ తిరంగా యాత్రలో నియోజకవర్గంలోని మూడు పార్టీల నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఆట స్థలాల ఏర్పాటుకు కృషిచేస్తాం

- డీఈవో రేణుక

'ఆంధ్రజ్యోతి'కి స్పందన

తెనాలి అర్బన్, మే 23 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ ఉన్నత పాఠశాలల్లో ఆట స్థలాల ఏర్పాటుకు అవసరమైన కృషి చేస్తామని జిల్లా విద్యాశాఖాధికారి పీవీ రేణుక తెలిపారు. మున్సిపల్ పాఠశాలల్లో ఆట స్థలాలేవి శీర్షికతో ఆంధ్రజ్యోతిలో శుక్రవారం వెలువడిన కథనానికి ఆమె స్పందించారు. ఈ అంశంపై నివేదిక అందించాలని ఎంఈవోను ఆదేశించారు. పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ సహకారంతో అవసరమైన పాఠశాలల్లో విద్యార్థుల కోసం మరుగుదొడ్ల నిర్మాణానికి ప్రతిపాదనలు ఆమోదం పొందాయన్నారు. ఆట స్థలాలు పాఠశాలలకు సమీపంలో క్రీడా మైదానాలు గుర్తించి విద్యార్థులను ఆటలు ఆడించేలా చర్యలు తీసుకుంటామని ఆమె తెలిపారు. చెంచుపేట హైస్కూల్‌లో మూడు కోర్టులు ఏర్పాటు చేసి విద్యార్థులకు క్రీడలు నిర్వహిస్తున్నట్లు వివరించారు.

వైకల్యం ఉన్నా పింఛన్ అందడంలేదు

- టీడీపీ గ్రీవెన్స్‌కు బాధితుల ఫిర్యాదు

తెనాలి రూరల్, మే 23 (ఆంధ్రజ్యోతి): తనకు సదరం సర్టిఫికెట్ ద్వారా 78శాతం వైకల్యం ఉన్నా గత ప్రభుత్వం దివ్యాంగుల పింఛన్ నిలిపివేసిందని తనకు తిరిగి పింఛన్ అందేలా చూడాలని టీడీపీ కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్‌కు బాధిత కుటుంబీకులు తెలిపారు. శుక్రవారం పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఆ పార్టీ నేతలు నియోజకవర్గ సమస్యలను బాధితుల నుంచి తెలుసుకుని పరిష్కరించేలా గ్రీవెన్స్ కార్యక్రమాన్ని నిర్వహించారు. పట్టణ, మండల అధ్యక్షుడు తాడిబోయిన హరిప్రసాద్, కేసన కోటేశ్వరరావు మహమ్మద్ ఖుద్దూస్, జొన్నాదుల మహేష్, డాక్టర్ వేమూరి శేషగిరిరావు, కొటా రమేష్‌లు అర్జీదారుల సమస్యలు తెలుసుకుని సత్వరమే పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు. తాడిబోయిన హరిప్రసాద్ మాట్లాడుతూ గ్రీవెన్స్‌లో 14 మంది అర్జీలు అందించారన్నారు. అందులో పోలీస్ స్టేషన్‌కు సంబంధించి, రేషన్ కార్డులు, సదరం సర్టిఫికేట్ ఉన్నా పింఛన్ నిలిపివేశారని ఇలా పలు సమస్యలతో వచ్చాయన్నారు. తెలిపిన ప్రతి సమస్యను ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ దృష్టికి తీసుకువెళ్లి త్వరితగతిన పరిష్కరించేలా కృషి చేస్తామని తెలిపారు. హరికృష్ణ, వెంకయ్యచౌదరి, కుదరవల్లి శ్రీనివాస్, తదిరులు పాల్గొన్నారు.



అర్జీలు స్వీకరిస్తున్న ఖుద్దూస్, హరిప్రసాద్, మహేష్ తదితరులు

నమస్తే పథకాన్ని సద్వినియోగం చేసుకోండి

- మునిసిపల్ కమిషనర్ శేషన్న

తెనాలి, మారీసుపేట,మే 23 (ఆంధ్రజ్యోతి): అసంఘటిత కార్మికులు నమస్తే పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని మునిసిపల్ కమిషనర్ బండి శేషన్న అన్నారు. శుక్రవారం స్థానిక మార్కెట్ సెంటర్‌లోని పురపాలక సంఘ కార్యాలయంలో వేస్ట్ పిక్కర్లకు నమస్తే స్కీమ్ ప్రొలింగ్ కార్యక్రమంపై అవగాహన కార్యక్రమాన్ని మునిసిపల్ ఛైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక, కమిషనర్ బండి శేషన్నతో కలసి నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ శేషన్న మాట్లాడుతూ అసంఘటిత కార్మికులకు సంక్షేమానికి నమస్తే పథకం ద్వారా కార్మికుల జీవితాలను మెరుగుపర్చడానికి, వారి నైపుణ్యాన్ని గుర్తింపునిస్తుందని అన్నారు. ఈ ప్రోగ్రాం ద్వారా వారికి గుర్తింపు కార్డులను, హెల్త్ కార్డులు పీపీ కిట్లు వారి పిల్లలకు ప్రీ మెట్రిక్ స్కాలర్ షిప్‌లను అందించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మీపతిరావు, ఎంహెచ్‌వో డాక్టర్ హెలెన్ నిర్మల, స్వచ్ఛంధ్రా కార్పొరేషన్ కో ఆర్డినేటర్ అనిల్ కుమార్, దళిత బహుజన రీసోర్స్ సెంటర్ స్టేట్ కో ఆర్డినేటర్ హేమలత, జిల్లా ఆర్గనైజర్ నిర్మల, రజని, వార్డు సెక్రటరీ వినీల్, సిబ్బంది పాల్గొన్నారు.

ఆచార్య సింహాచలంకు పురస్కారం

పెదకాకాని, మే 23 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య జి.సింహాచలం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బయోడైవర్సిటీ బోర్డు ప్రతిష్ఠాత్మకమైన 'ఉత్తమ బయోడైవర్సిటీ కన్జర్వర్' అవార్డును అందుకున్నారు. జువాలజీ, జీవవైవిధ్య సంరక్షణ రంగాలలో ఆయన చేసిన విశేష కృషికి గుర్తింపుగా ఈ పురస్కారం లభించింది. శుక్రవారం విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో అంతర్జాతీయ జీవ వైవిధ్య దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని బయో డైవర్సిటీ బోర్డు ఈ అవార్డు ప్రదానోత్సవాన్ని నిర్వహించింది. రాష్ట్ర పర్యావరణ శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ నుంచి ఆచార్య సింహాచలం ఈ అవార్డును స్వీకరించారు. ఆచార్య సింహాచలంను వర్సిటీ అధికారులు, ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బంది, పరిశోధకులు, విద్యార్థులు అభినందించారు.



పవన్ కల్యాణ్ నుంచి అవార్డు అందుకుంటున్న ఆచార్య సింహాచలం

మెడికల్ క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలి

- మండల వైద్యాధికారి సుమంత్

కొల్లిపర, మే 23 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో ఏర్పాటుచేస్తున్న మెడికల్ క్యాంపులను పేద ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మండల వైద్యాధికారి సుమంత్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని వల్లభాపురంలో వైద్యాధికారులు ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ క్యాంపును నిర్వహించారు. వైద్యాధికారులు రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేసి తగిన సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా సుమంత్ మాట్లాడుతూ మెడికల్ క్యాంపు ఏర్పాటు చేయడం వలన దీర్ఘకాలిక రోగాలను గుర్తించవచ్చునన్నారు. ప్రతి నెల నిర్వహించే ఎఫ్‌పీసీ క్యాంపులో మంచంలో ఉన్న వారికి కూడా ఇంటికి వెళ్ళి వైద్యసదుపాయం కల్పించనున్నట్లు తెలియజేశారు. కార్యక్రమంలో ఎమ్‌ఎల్‌హెచ్‌పీ సరళ, ఏఎన్‌ఎం జ్యోతి, హెల్త్ అసిస్టెంట్ మల్లేశ్వరరావు, డీఈవో బొమ్ము కోటిరెడ్డి, ఆషా కార్యకర్తలు సీతామహాలక్ష్మి, కృష్ణకుమారి తదితరులు పాల్గొన్నారు.